



వేదికపై ఆశీనులైన శ్రీదేవి, భూదేవి సహిత వేంకటేశ్వరస్వామి



సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో ఏఎంజీ ఎంవోయూ

మరో ముందడుగు

- సర్కారుతో ఏఎంజీ మెటల్ ఒప్పందం
- రూ.44 వేల కోట్లతో పరిశ్రమ
- యు.కొత్తపల్లిలో ఏర్పాటు

ఈ పరిశ్రమలో ఏం చేస్తారంటే..

ఈ సంస్థ బాక్సైట్ ఖనిజం నుంచి తీసిన అల్యుమినాను ముడిపదార్థంగా ఉపయోగించి అల్యూమినియంను ఇంగోట్స్ రూపంలో తయారు చేస్తుంది. వీటిని కరిగించి ఐరన్ బిల్లెట్స్, వైర్ రాడ్‌లు, అల్యూమినియం షీట్లు, కాయిల్స్ వంటివి తయారు చేస్తారు.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

విశాఖ పెట్టుబడుల సదస్సులో కాకినాడకు భారీ పెట్టుబడి వచ్చింది. రూ.44వేల కోట్లతో ఏఎం గ్రీన్ మెటల్ అండ్ మెటీరియల్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ అల్యూమినియం స్మెల్టర్ ఏర్పాటుకు ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈమేరకు సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి పీయూష్ గోయెల్ సమక్షంలో ఏఎం గ్రీన్ ఒప్పందంపై సంతకం చేసింది. పిఠాపురం నియోజకవర్గంలోని యు.కొత్తపల్లి మండలంలో ఈ కంపెనీ ఏర్పాటుకానుంది. కంపెనీ స్థాపనలో భాగంగా భూమి, భూ అభివృద్ధికి రెండు దశల్లో రూ.1800 కోట్లు, భవనాలు, ఇతర సివిల్ పనులకు రెండు దశల్లో రూ.2,950కోట్లు, ప్లాంట్, ఇతర యంత్రాలకు రెండు దశల్లో రూ.30,300కోట్లు, ఇంకా ఇతర ఖర్చులు కలిపి మొత్తం తొలిదశ కింద రూ.24,250 కోట్లు, రెండో దశ కింద రూ.19,750కోట్లు కలిపి మొత్తం రూ.44వేల కోట్లు పెట్టుబడి పెట్టనున్నట్టు ఎంఓయూలో కంపెనీ పేర్కొంది. తొలి దశలో 0.5 మిలియన్ టన్నులు, రెండోదశలో 0.5మిలియన్ టన్నులు ఉత్పత్తి చేయనుంది. తద్వారా మొత్తం 3 వేల మందికి ఉపాధి కల్పించనుంది. ఇప్పటికే ఈ సంస్థ రాష్ట్రంలో రూ.50 వేల కోట్లతో పలు ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెట్టింది. కాగా ఈ సంస్థకు ఇటీవల రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక పారిశ్రామిక ప్రోత్సాహకాలు ప్రకటించింది. ఎస్ఐపీబీ సిఫార్సుల మేరకు 250 ఎకరాల భూకేటాయింపునకు ప్రభుత్వం అనుమతిచ్చింది. ఉత్పత్తికి సహకరించడంలో భాగంగా గ్రీన్‌కారిడార్ విధానంలో 2,500మెగావాట్ల విద్యుత్, నీటి అవసరాలు తీర్చేలా 17.2 ఎంఎల్‌డీ నీటి సరఫరా, భారీ పరిశ్రమ కేటగిరీలోకి చేర్చి అన్ని ప్రభుత్వశాఖల నుంచి అవసరమైన అన్నిరకాల అనుమతులు వేగంగా జారీచేయనుంది. ఇదే సంస్థ కాకినాడలో గ్రీన్ అమ్మోనియా తయారీ ప్లాంట్ ఏర్పాటుకు రూ.13వేల కోట్లు పెట్టుబడి పెట్టడానికి ముందుకొచ్చింది.

గోవింద హారతి!






గోదావరి మాతకు హారతిస్తున్న ఆనంద తీర్థాచార్యులు, ఎమ్మెల్యే ముప్పిడి తదితరులు

టీటీడీ ఆధ్వర్యంలో కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో గోదావరి మాతకు శుక్రవారం రాత్రి మహా మంగళ హారతి అందజేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వార్ల ఉత్సవ విగ్రహాలను తీసుకువచ్చారు.. ఏడుకొండలవాడు.. భక్తజనం చెంతకు వస్తున్నాడంటే ఊరుకుంటారా.. ఆ స్వామిని చూసేందుకు తండోపతండాలుగా తరలివచ్చారు.. ఎటుచూసినా భక్తజనమే.. కొవ్వూరు గోదావరి తీరమంతా భక్తజన సంద్రమైంది.. ఆ స్వామిని కన్నులారా చూసి.. మనసారా వేడుకున్నారు.. విశిష్ట పూజలు చేశారు. గోవిందా.. గోవింద నామస్మరణలతో గోష్పాద క్షేత్రం మార్మోగింది.. గోదావరికి గోవిందుడి హారతిచ్చారు.

ఎన్నికలొస్తున్నాయ్!



స్థానికం..సమాయత్తం

- ముందస్తు సన్నాహాలు
- ఓటర్ల జాబితాకు కసరత్తు
- పార్టీ శ్రేణులకు టీడీపీ పిలుపు
- అధికారులకు ఎస్ఈసీ లేఖలు
- 2026 జనవరిలోగా నోటిఫికేషన్
- అదే నెలలో ఫలితాలు

స్థానిక సంస్థల ఎన్నికలకు రంగం సిద్ధమవుతోంది. గడువుకు ముందే ముందస్తు ఎన్నికల మోత మోగబోతోంది. పంచాయతీలు, మునిసిపాలిటీలు, నగర పంచాయతీల్లో ఎన్నికల రణభేరికి సర్వం సిద్ధమవుతోంది. తాజాగా ఓటర్ల జాబితా సమగ్ర సవరణకు ఎన్నికల సంఘం కార్యాచరణ రూపొందిస్తోంది. మరోపక్క స్థానిక ఎన్నికలకు సిద్ధంగా ఉండాలంటూ కేడర్‌ను సైతం టీడీపీ సిద్ధం చేస్తోంది. దీంతో కొద్దిరోజుల్లో స్థానిక సంస్థల వేడి రాజుకోనుంది. - (కాకినాడ/ఆంధ్రజ్యోతి)

అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఏడాదిన్నరకు స్థానిక సంస్థల ఎన్నికల సందడి ఉమ్మడి జిల్లాలో మొదలు కాబోతోంది. వాస్తవానికి వచ్చే ఏడాది మార్చి నాటికి మునిసిపాలిటీలు, నగర పంచాయతీలు, సర్పంచ్‌లకు ఐదేళ్ల పదవీకాలం పూర్తవుతోంది. మార్చి తర్వాత రాష్ట్ర ప్రభుత్వం తనకు నచ్చినప్పుడు ఎన్నికలు జరపొచ్చు. కానీ ప్రభుత్వం మాత్రం ముందస్తుకే మొగ్గు చూపుతోంది. అసెంబ్లీ ఎన్నికలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను ఏడాదిన్నరలోపే కూటమి సర్కారు అమలుచేసి జోష్ మీద ఉంది.ఈ సమయంలోనే ముందస్తు ఎన్నికలకు వెళ్లి విజయభేరి మోగించాలని భావిస్తోంది. ఎన్నికలకు కేడర్‌ను సన్నద్ధం చేస్తోంది. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఇటీవల అమరావతిలో పార్టీ జోనల్ కో ఆర్డినేటర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని ఆదేశించారు. పార్టీ నేతలు, క్యాడర్‌ను సమాయత్తం చేయాలని సూచించారు. ఎన్నికలకు సమాయత్తమయ్యే ప్రక్రియలో భాగంగా ఇప్పటికే పార్టీ పదవులు చాలావరకు భర్తీ చేశారు. అటు నామినేటెడ్ పదవుల పంపకం పూర్తిచేశారు.

జనవరిలో ఎన్నికలు..?

స్థానిక సంస్థల గడువు ముగియడానికి మూడు నెలల ముందే వీటికి ఎన్నికలు నిర్వహించేలా రాష్ట్ర ఎన్నికల సంఘం కసరత్తు మొదలుపెట్టింది. మునిసిపాలిటీలు, పంచాయతీలకు వచ్చే ఏడాది జనవరిలో ఎన్నికలు నిర్వహించడానికి వీలుగా కసరత్తు ప్రారంభించాలని ఆదేశిస్తూ పురపాలక, పంచాయతీరాజ్ శాఖలకు సెప్టెంబరులో లేఖ రాసింది. తాజాగా ఎన్నికల నిర్వహణకు సంబంధించి కీలకమైన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్(సీఈవో) సన్నాహాలు మొదలుపెట్టారు. ఈనెల 6న అమరావతి నుంచి జిల్లా కలెక్టర్లతో సమీక్షించారు. ఓటర్ల జాబితా సవరణకు వీలుగా సిబ్బందికి శిక్షణ ప్రారంభించబోతున్నారు. ఈనెలాఖరులోగా ఓటర్ల నమోదు ప్రక్రియ ప్రారంభమయ్యే అవకాశం ఉన్నట్టు అధికారులు పేర్కొన్నారు. డిసెంబరులో వార్డుల వారీగా ఓటర్ల జాబితాల ప్రచురణ, ఎన్నికల అధికారుల నియామకం, పోలింగ్ కేంద్రాల ఖరారు, ఈవీఎంలను సిద్ధం చేయడం, రిజర్వేషన్లు ఖరారు తదితర ప్రక్రియ పూర్తి చేయనున్నట్లు సమాచారం.జనవరి నెలాఖరులో ఎన్నికల నోటిఫికేషన్, అదే నెలలో ఫలితాల వెల్లడికి వీలుగా రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాచరణ సిద్ధం చేస్తోంది.

2021లో ఎన్నికలు ఇలా..

ఉమ్మడి జిల్లాలో 2021 ఫిబ్రవరిలో 1,073 పంచాయతీల్లో నాలుగుదశల్లో 11,782 వార్డులకు 12,048 పోలింగ్ స్టేషన్లలో ఎన్నికలు నిర్వహించారు.31 పంచాయతీలకు వివిధ కారణాలతో ఎన్నికలు జరగలేదు. కాకినాడ, పెద్దాపురం రెవెన్యూ డివిజన్ల పరిధిలో 366 పంచాయతీలకు తొలివిడత, రెండో విడత రాజమహేంద్రవరం, రామచంద్రపురం డివిజన్ల పరిధిలో 247 పంచాయతీలకు, మూడో విడత రంపచోడవరం, ఎటపాక డివిజన్ల పరిధిలో 186 పంచాయతీలకు, నాలుగో విడత కోనసీమలో 274 పంచాయతీలకు ఎన్నికలు జరిగాయి. అప్పట్లో మొత్తం ఓటర్లు 7,68,483గా తేలారు. వచ్చే ఏడాది జనవరిలో జరగనున్న పంచాయతీ ఎన్నికల్లో వార్డులు, ఓటర్లు పెరగనున్నాయి.

పెరగనున్న వార్డులు..

ఉమ్మడి జిల్లాలో తొమ్మిది మునిసిపాలిటీలు, మూడు నగర పంచాయతీలు ఉన్నాయి. కాకినాడ, రాజమహేంద్రవరంలో రెండు కార్పొరేషన్లు ఉన్నాయి. వీటన్నింటిలో వార్డుల విభజన నేపథ్యంలో వీటి సంఖ్య పెరగనుంది. కాకినాడ కార్పొరేషన్‌కు 2022 సెప్టెంబరుకు ఐదేళ్ల పదవీ కాలం పూర్తయినా మళ్లీ ఇప్పటివరకు ఎన్నికలు జరగ లేదు. ఇప్పుడు ఎన్నికలు జరిగితే ప్రస్తుతం ఉన్న 50 వార్డులకు అదనంగా మరో పది వార్డుల వరకు పెరిగే అవకాశం ఉంది. రాజమహేంద్రవరం కార్పొరేషన్ పరిధిలో శివారు గ్రామాల విలీనం సమస్య పరిష్కారమై పెరిగే వార్డులతో కలిపి ఇక్కడా ఎన్నికలు జరగనున్నాయి.

కొత్త వాళ్లకు చోటు..

2021 మార్చిలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఏడు మునిసిపాలిటీలు, మూడు నగర పంచాయతీల్లో కలిపి మొత్తం 268 వార్డులకు ఎన్నికలు నిర్వ హించారు. ఉమ్మడి జిల్లా పరిధిలో కొవ్వూరు, నిడదవోలు మునిసిపాలిటీలు చేరడంతో వీటి సంఖ్య తొమ్మి దికి చేరనుంది.అప్పట్లో చేతిలో అధికారం ఉండడంతో వైసీపీ అడ్డగోలుగా 35 వార్డుల్లో బలవం తపు ఏకగ్రీ వాలు చేయించింది.దీంతో 233 వార్డులకే ఎన్నికలు జరిగాయి. వార్డుల పునర్విభజన నేపథ్యంలో ఒక్కో మునిసిపాలిటీ, నగర పంచాయతీల్లో వార్డుల సంఖ్య మరింత పెరగనుంది. గత మునిసిపల్ ఎన్నికల్లో మొత్తం 655 మంది అభ్యర్థులు బరిలో నిలబడ్డారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో మరింత మంది పోటీ చేసే అవకాశం దక్కనుంది.

మళ్లీ అవకాశం!



- 'సదరం' సర్టిఫికెట్ల స్లాట్ బుకింగ్ పునఃప్రారంభం
- డిసెంబర్ నెలాఖరు వరకు కొనసాగింపు
- దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్

కాకినాడ, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): అర్హత ఉండి పింఛన్లు ఇంకా పింఛను అందని దివ్యాంగులకు జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ శుభవార్త వినిపించారు. చాలారోజులుగా 'సదరం' సర్టిఫికెట్ల కోసం వేచిచూస్తున్న వారి కోసం స్లాట్ బుకింగ్‌ను పునఃప్రారంభిస్తున్నట్టు శుక్రవారం వెల్లడించారు. డిసెంబర్ నెలాఖరు వరకు దీన్ని కొనసాగించనున్నారు. ఇప్పటికే వెయిటింగ్ లిస్టులో ఉన్నవారికి స్లాట్ బుకింగ్ ఖరారులో తొలి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ఆ తర్వాత కొత్తగా దరఖాస్తు చేసుకునే వారికి స్లాట్లు(తేదీ, సమయం) ఇస్తామని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ వెల్లడించారు.

సదరం కింద కాకినాడ జీజీహెచ్‌లో మంగళవారం, తుని ఏరియా ఆసుపత్రిలోను ప్రతి మంగళవారం, ప్రత్తిపాడు సీహెచ్‌సీలో ప్రతి సోమవారం దివ్యాంగులకు వైద్యుల ద్వారా వైకల్య నిర్ధారణ పరీక్షలు జరుగుతాయని తెలిపారు.

ఏ రోజు ఎక్కడెక్కడంటే..

చూపు మందగించడం,వినికిడి లోపం, మానసిక వైకల్యం, మందబుద్ధిలోపం కేటగిరీల్లో దరఖాస్తుదారులకు ఉన్న వైకల్యశాతాన్ని అనుసరించి వైద్యులు సర్టిఫికెట్లు జారీచేస్తారు. వీటికి అనుగుణంగా పింఛన్, ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హత లభిస్తుంది. గతంలో వైకల్యం తక్కువగా నిర్ధారణ అయిన వారికి అప్పీల్ అవకాశాన్ని కల్పించగా.. ఇది చేసుకున్న వారికి కూడా తిరిగి పరీక్షలు నిర్వహించి సదరం సర్టిఫికెట్లు జారీ చేయనున్నారు.

లక్ష గాజుల అలంకరణలో..

బాలాత్రిపురసుందరి అమ్మవారి దర్శనం



కాకినాడ సిటీ, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా కాకినాడ సూర్యారావుపేటలోని బాలాత్రిపుర సుందరి అమ్మవారు లక్ష గాజుల అలంకరణ రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈసందర్భంగా కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అమ్మవారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యేను ఉత్సవ కమిటీ చైర్మన్,ఈవో పట్టు కండువాతో సత్కరించారు. కార్యక్రమాన్ని ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ గ్రంధి బాబ్జి, ఈవో ఉండవల్లి వీర్రాజుచౌదరి పర్యవేక్షించారు. టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యురాలు నల్లూరి తులసి శ్రీనివాస్ పాల్గొన్నారు.

మధుమేహ నివారణ స్క్రీనింగ్‌తో సాధ్యం: డీఎంహెచ్‌వో



కాకినాడలో నిర్వహించిన ర్యాలీలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ నాయక్

జీజీహెచ్(కాకినాడ), నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మధుమేహ నివారణ కేవలం స్క్రీనింగ్.. తద్వారా క్రమం తప్పకుండా మందులు వాడడం ద్వారా మాత్రమే సాధ్యమవుతుందని, నిర్లక్ష్యం వహిస్తే తగిన మూల్యం చెల్లించక తప్పదని డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహ నాయక్ అన్నారు. ప్రపంచ మధుమేహ అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకుని కాకినాడ డీఎంహెచ్‌వో కార్యాలయంనుంచి తెలుగుతల్లి విగ్రహం వరకు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. 'మధుమేహం ముప్పు-అందరికీ ఉందని చెప్పు' అనే నినాదంతో ఈ ర్యాలీని కొనసాగించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ముందుగా కార్యాలయ సిబ్బందికి షుగరు పరీక్షలు నిర్వహించామన్నారు. డయాబెటీస్‌పై అవగాహన, దాని ప్రాముఖ్యత, నివారణ ముఖ్యంగా జీవన శైలిలో మార్పులు తదితర అంశాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు.తరచూ మూత్ర విసర్జన - క్రియాటినైన్ - మానసికస్థితిలో మార్పు - కళ్ల దృష్టిలో మార్పు - బరువు తగ్గడం - నిస్సత్తువ ఆవహించడం - ఎక్కువగా దాహం కలగడం డయాబెటిస్ మెలిటస్ లక్షణాలన్నారు. మధుమేహంపై సరైన అవగాహన లేక ఎక్కువమంది దీనిబారిన పడుతున్నారన్నారు. నిరక్షరాస్యత, మద్యపానం, ఊబకాయం, ఆహారపు అలవాట్లతోపాటు జీవనశైలిలోమార్పు ద్వారా మధుమేహం వచ్చేఅవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. ఇందులో భాగంగా ప్రతి ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సామాజిక ఆరోగ్య కేంద్రం, ఏరియా ఆస్పత్రుల్లో ప్రతిరోజూ మధుమేహం పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఉచిత సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్‌వో సూచించారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే పీవో డాక్టర్ అరుణ, డీఎల్‌వో డాక్టర్ చలమయ్య, డీఐవో డాక్టర్ కేవీ సుబ్బరాజు, జిల్లా ఫైలేరియా అధికారి డాక్టర్ ప్రభాకర్, డీపీఎంవో డాక్టర్ జి.లక్ష్మి, డాక్టర్ ప్రత్యూష,డాక్టర్ కృష్ణవాసన్ తదితరులు పాల్గొన్నారు.



నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యేలు

పరిపాలన దక్షత ఉన్న నేత జవహర్‌లాల్ నెహ్రూ

- జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 14(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర సమరయోధుడిగా, దేశ తొలి ప్రధానిగా పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ తన పరిపాలన దక్షత, ముందుచూపుతో దేశాన్ని పరిపాలించిన గొప్ప నాయకుడని కలెక్టర్ షాన్‌మోహన్ అన్నారు. శుక్రవారం నెహ్రూ జయంతిని కాకినాడ కలెక్టరేట్‌లో నిర్వహించారు. కలెక్టర్‌తోపాటు రాష్ట్ర ప్రభుత్వ విప్ దాట్ల బుచ్చిబాబు, కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు, పుదుచ్చేరి ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, యానాం రీజినల్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి అంకిత్‌తో కలిసి జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ జాతీయ ఉద్యమకాలంలో దేశ స్వాతంత్రం కోసం జవహర్‌లాల్ నెహ్రూ అనేకసార్లు జైలుశిక్ష అనుభవించారన్నారు. దేశ తొలి ప్రధానిగా ముందుచూపుతో దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారన్నారు. ఆయన జన్మదినాన్ని ప్రతిఏటా బాలల దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. ఆయన జీవిత విధానాన్ని ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కేఆర్‌ఆర్సీ ఎస్డీసీ రత్నమణి, కలెక్టరేట్ పరిపాలన అధికారి రామ్మోహన్‌రావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా పిఠాపురం

- 19 ఆలయాల అభివృద్ధికి రూ.20 కోట్లు
- సీజీఎఫ్ నిధుల విడుదలకు దేవదాయ శాఖ అంగీకారం

7

కాకినాడ విచ్చేసిన ఫ్రాన్స్ దౌత్యవేత్త

- స్వాగతం పలికిన కాకినాడ ఆర్డీవో

కాకినాడసిటీ, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): భారత్‌లోని ఫ్రాన్స్ దౌత్యవేత్త థియరీ మాథౌ మూడురోజుల పర్యటన నిమిత్తం శుక్రవారం కాకినాడ విచ్చేశారు. ఈసందర్భంగా ఆయనకు ఓ హోటల్‌లో కాకినాడ ఆర్డీవో ఎస్.మల్లిబాబు స్వాగతం పలికారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన యానాం, ద్రాక్షారామ వెళ్లనున్నారు. ఆయా ప్రాంతాల్లో పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. అనంతరం విశాఖపట్నం బయలుదేరి వెళ్తారని ఆర్డీవో తెలిపారు. ఫ్రాన్స్ దౌత్యవేత్తకు స్వాగతం పలికిన వారిలో జిల్లా పంచాయతీ అధికారి రవి కుమార్, కాకినాడ అర్బన్ తహసీల్దార్ వి.జితేంద్ర తదితరులు ఉన్నారు.



ఫ్రాన్స్ దౌత్యవేత్తకు స్వాగతం పలుకుతున్న ఆర్డీవో





- ఆకర్షణీయంగా.. ఆకట్టుకునేలా ఎసెస్‌మెంట్ బుక్‌లెట్ల రూపకల్పన
- సబ్జెక్టుల వారీగా అన్ని పరీక్షలకు ఒకే బుక్‌లెట్
- విడి పేపర్లపై పరీక్షలు రాసే విధానానికి స్వస్తి
- అంతర్జాతీయ ప్రమాణాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో పరీక్షల నిర్వహణ

పేపర్లు కాదు...

సబ్జెక్టుల వారీగా ఇచ్చిన ఎసెస్‌మెంట్ బుక్‌లెట్లు

పుస్తకాలపైనే

ఇప్పటి వరకూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు పరీక్షలు రాసేది పేపర్లపై. వాటిని ఏ పరీక్షకు ఆ పరీక్షకు ఇచ్చి వాటిని మూల్యాంకనం చేసి పక్కన పెట్టేవారు. ఇప్పుడు అలా కాదు ఆ విధానాన్ని పూర్తిగా మార్చివేశారు. సబ్జెక్టుల వారీగా అన్ని పరీక్షలకు కలిపి వేర్వేరు బుక్‌లెట్లును విద్యార్థులకు అందించి పరీక్షలు రాయిస్తున్నారు. దీనితో ప్రతి విద్యార్థి ప్రగతిని ఇట్టే ఉపాధ్యాయులు అవగాహన చేసుకునే వీలు ఏర్పడుతుంది. అదేవిధంగా పరీక్షల మార్కులను ఆన్‌లైన్ చేయనున్నారు.

(పిఠాపురం/గొల్లప్రోలు- ఆంధ్రజ్యోతి)

చిన్ననాటి నుంచి ప్రభుత్వ, మండల, మునిసిపల్, జిల్లాపరిషత్ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో పరీక్షలను విద్యార్థులు అప్పటికప్పుడు ఇచ్చే తెల్లకాగితాలపైనే రాసేవారు. ఈ విధానమే పీజీ వరకూ అమలులో ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి విద్యారంగంలో వస్తున్న సంస్కరణల్లో భాగంగా ఇప్పటికే పాఠ్య పుస్తకాలను సమూలంగా మార్పు చేశారు. సెమిస్టర్ విధానాన్నీ అమలు చేస్తున్నారు. బోధనలోనూ కొత్త విధానాలు తీసుకువచ్చారు. సాధారణంగా ఒకటవ తరగతి నుంచి పదవ తరగతి వరకూ ప్రతి విద్యాసంవత్సరంలో ఫార్మటివ్ అసెస్‌మెంట్ (యూనిట్) పరీక్షలు నాలుగు జరుగుతాయి. క్వార్టర్లీ, హాఫ్ ఇయర్లీ, ఫైనల్ ఎగ్జామ్స్ స్థానంలో సమ్మెటివ్ అసెస్‌మెంట్ 1,2 పరీక్షలను నిర్వహిస్తున్నారు. కొత్త విధానంలో మొదటి, రెండవ సెమిస్టర్లల్లో రెండు ఫార్మటివ్, ఒక సమ్మెటివ్ అసెస్‌మెంట్ పరీక్షలు వంతున జరుగుతాయి. ఇప్పటికే రెండు ఫార్మటివ్ పరీక్షలు ముగియగా, ప్రస్తుతం సమ్మెటివ్ ఎసెస్‌మెంట్-1 పరీక్షలు జరుగుతున్నాయి.

అందంగా తీర్చిదిద్దారు

పరీక్షలు రాసే విధానంలో సమూల మార్పులు తీసుకువచ్చారు. విద్యార్థులపై ఒత్తిడి లేని రీతిలో పరీక్షలు పేపర్లపై కాకుండా అందంగా, ఆకర్షణీయంగా ఉన్న పుస్తకాలపై రాసేలా నిర్ణయించిన ప్రభుత్వం, నిపుణుల సలహాలతో అసెస్‌మెంట్ బుక్‌లెట్లును రూపొందించారు. 1నుంచి 10వ తరగతి చదివే ప్రతి విద్యార్థికి వారు చదువుతున్న తరగతులకు అనుగుణంగా ప్రతి సబ్జెక్టుకు ఒక బుక్‌లెట్ తయారుచేశారు. విద్యార్థులు అన్ని ఫార్మటివ్, ఎసెస్‌మెంట్ పరీక్షలను ఇందులోనే రాయాల్సి ఉంటుంది. వీటిని ఎప్పటికప్పుడు సంబంధిత క్లాస్ టీచర్ లేదా సబ్జెక్టు టీచర్ మూల్యాంకనం చేసి అదే బుక్‌లో మార్కులు నమోదు చేస్తారు. కాకినాడ జిల్లాలోని అన్ని పాఠశాలలతోపాటు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లో గల అన్ని ప్రభుత్వ, మునిసిపల్, మండల పరిషత్, కార్పొరేషన్, జిల్లా పరిషత్ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు సరిపడా బుక్‌లెట్లును అందజేశారు. ఇప్పటికే విద్యార్థులు రెండు ఎఫ్ఏ పరీక్షలను ఈ బుక్‌లెట్లుల్లో రాయగా, ప్రస్తుతం జరుగుతున్న సమ్మెటివ్ అసెస్‌మెంట్-1 పరీక్షలను ఇందులోనే రాస్తున్నారు. ఆకట్టుకునే రీతిలో ఉన్న ఈ బుక్‌లెట్‌లపై పరీక్షలు రాయడం వల్ల విద్యార్థులపై ఒత్తిడి తగ్గి ప్రశాంతంగా పరీక్షలు రాయగలుగుతారని విద్యావేత్తలు పేర్కొంటున్నారు.

ఎప్పటికప్పుడు విద్యార్థి ప్రగతిపై..

ప్రతి సబ్జెక్టుకు ఒక బుక్‌లెట్ ఇచ్చి దానిపైనే ఆ విద్యా సంవత్సరంలో పరీక్షలు అన్ని రాసే విధానం అమలులోకి తేవడంతో విద్యార్థుల ప్రగతిపై ఎప్పటికప్పుడు పరిశీలన చేసే అవకాశం ఉపాధ్యాయులు లభిస్తోంది. అదే విధంగా ఈ బుక్‌లెట్‌ను విద్యార్థి అపార్ లేదా పెన్ ఐడీకి అనుసంధానం చేస్తున్నారు. ఈ అసెస్‌మెంట్ పరీక్షల మార్కులతోపాటు విద్యా సంవత్సరం చివరిలో ఇంటర్నల్ మార్కులు కూడా కలుపుతారు. ప్రతి పరీక్షకు మార్కులతోపాటు గ్రేడ్‌ను కూడా ఇస్తారు. విద్యాసంవత్సరం పూర్తైన తర్వాత సర్టిఫికెట్ ఆఫ్ అసెస్మెంట్ కంప్లీషన్‌ను విద్యార్థికి అందజేస్తారు. ఇలా ప్రతి సబ్జెక్టుకు సర్టిఫికెట్లు ఇవ్వడం విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపుతాయని ఉపాధ్యాయులు తెలిపారు. బుక్‌లెట్లపై పరీక్షలు రాయడం ఆనందంగా ఉందని, ఇది తమ ప్రగతికి దిక్సూచిగా నిలుస్తుందని విద్యార్థులు చెప్పారు.





అంబాజీపేటలో ఏర్పాటు చేసిన వెచ్చని దుస్తులు.. జి.అగ్రహారంలో చలిమంట వేసుకున్న యువకులు

చలి పంజా

- పెరిగిన చలిగాలులు
- చలి తట్టుకొనేలా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు
- పల్లెల్లో వెలుస్తున్న ఉన్ని దుస్తుల దుకాణాలు

అంబాజీపేట,నవంబరు14(ఆంధ్రజ్యోతి): వాతావరణ మార్పులతో శీతల గాలులు భారీగా వీస్తున్నాయి. గత రెండు రోజుల నుంచి చలిగాలుల తీవ్రత పెరిగింది. రోజురోజుకి చలి తీవ్రత అధికమవ్వడంతో ప్రజలు చలికి విలవిలాడుతున్నారు. చలిగాలులు మున్ముందు ఎలా ఉంటాయోనని ఆందోళన చెందుతున్నారు. మరోపక్క చలి నుంచి రక్షించుకొనేందుకు ప్రత్యామ్నాయాలను ఆశ్రయిస్తున్నారు. అదే సమయంలో రగ్గులు, స్వెట్టర్లు అమ్మే ప్రత్యేక దుకాణాలు కూడా వెలుస్తున్నాయి. చలికాలం ప్రారంభమై నెలరోజులు కావడంతో చలిగాలులు క్రమేపీ పెరుగుతున్నాయి. ఉదయం ఏడు గంటల వరకూ చలి తీవ్రత అలాగే ఉండడంతో చిన్నారుల నుంచి వృద్ధుల వరకు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం పరిస్థితి ఇలా ఉంటే సాయంత్రం పరిస్థితి మరోలా ఉంది. ఆరు గంటల నుంచే వాతావరణం ఒక్కసారిగి మారిపోయి చలి తీవ్రత ప్రారంభమవుతోంది. అప్పటినుంచి ప్రారంభమైన చలిగాలులు రాత్రంతా కొనసాగుతున్నాయి. పల్లెల్లో సుమారు 22 నుండి 25 డిగ్రీల వరకూ ఉష్ణోగ్రతలు తగ్గాయి. కనిష్ఠ దీంతో కనీసం బయటకు రాలేక గడపాల్సిన పరిస్థితి ఏర్పడింది. కూలీ పనులకు వెళ్లే కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే మాలలు ధరించిన అయ్యప్ప, భవాని, శివమాలధారులు చలికి మరింత ఇబ్బంది పడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వెచ్చదనం కోసం చలి మంటలను వేసుకుంటున్నారు. ఇప్పటికే ప్రజలు శీతాకాల ప్రభావంతో జలుబు, దగ్గు, జ్వరాలతో బాధపడుతున్నారు. చలి ఇలాగే కొనసాగితే మరిన్ని రుగ్మతలకు లోనయ్యే ప్రమాదం ఉంటుందని అంటున్నారు. ఈ నేపథ్యంలో వెచ్చని ఉన్ని వస్త్రాలకు గిరాకీ పెరిగింది. ఈ సీజన్‌లో రాజస్థాన్, మధ్యప్రదేశ్, నేపాల్ ప్రాంతాలకు చెందిన వ్యాపారులు పట్టణాలతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో దుకాణాలు ఏర్పాటు చేయడం మామూలే. ఈ ఏడాదీ ఈ వెచ్చని నేస్తాలను విక్రయించేందుకు పట్టణాలకు వచ్చారు. ప్రస్తుతం చలి పెరుగుతుడడంతో దుస్తుల అమ్మకాల సాగించేందుకు వ్యాపారులు ఇతర రాష్ట్రాల నుంచి గ్రామాలకు వచ్చి అమ్మకాలు సాగిస్తున్నారు. గతంలో అల్లికల స్వెట్టర్లను వినియోగించేవారు. ఇప్పుడు ఎక్కువగా యంత్రాలపై తయారుచేసిన ఉన్ని దుస్తులు ఆకర్షణీయంగా ఉండడంతో వాటిపైనే ఆసక్తి చూపుతున్నారు. చలితోపాటు వర్షం నుంచి రక్షణగా ఉపయోపడేలా తయారుచేసిన ఉన్ని దుస్తులకు డిమాండ్ పెరిగింది. చెవులకు కప్పే మంకీ క్యాప్‌లు, చేతులకు గ్లౌజులు, చిన్నారులను ఆకర్షించే టెడ్డీ బేర్ తరహా దుస్తులు, రగ్గులు, సోలాపూర్, దుప్పట్లు వివిధ ఆకర్షణీయమైన రంగు, బొమ్మలతో ముద్రించిన ఉన్ని దుస్తుల కొనుగోలుకు ప్రజలు మక్కువ చూపుతున్నారు. ఉన్ని వస్తువులు రకాలను బట్టి రూ.100 నుంచి రూ.2వేల వరకు వాటి ధరలున్నాయి.

83 రోజులపాటు శుక్రమౌఢ్యం

- వివాహాది శుభ కార్యక్రమాలకు ముహూర్తాలు నిల్
- బంగారం దిగివచ్చేనా..?

అమలాపురంరూరల్, నవంబరు14(ఆంధ్రజ్యోతి): బంగారం ప్రస్తావన లేకుండా ఏ శుభ కార్యక్రమం పూర్తికాని రోజులివి. ఇక వివాహ సమయాల్లో అయితే బంగారు ఆభరణాలకు ఇచ్చే ప్రాధాన్యత అంతా ఇంతా కాదు. బంగారు ఆభరణాలతో హుందాతనాన్ని ప్రదర్శించే రోజులివి. ఎన్నడూ లేనివిధంగా బంగారం ధరలు ఆకాశంలో చుక్కలనే దాటిపోయిందని చమత్కరిస్తున్నారంతా. రెండేళ్ల వ్యవధిలో రెట్టింపు అయిన బంగారం ధరలు తగ్గే అవకాశం ఉందా అన్న ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతుంది. ఈ ఏడాది వివాహాది శుభ ముహుర్తాలకు ఇక రెండు రోజులే మిగిలి ఉంది. ఆ తరువాత 83 రోజులపాటు శుక్రమౌఢ్యం కావడంతో వివాహాది శుభ కార్యక్రమాలకు ముహుర్తాలు ఉండవు. దాంతో ఆ సమయంలోనైనా బంగారం ధరలు దిగి వస్తాయన్న ఆశాభావంతో పేద, మధ్యతరగతి ప్రజలు ఎదురు చూస్తున్నారు. పెరుగుట విరుగుట కొరకే అన్న సామెత బంగారానికి వర్తిస్తుందో లేదో వేచి చూడాల్సిందే. శుక్రమౌఢ్యం కారణంగా వివాహ, గృహప్రవేశ, శంకుస్థాపనల వంటి శుభ కార్యక్రమాలకు సుమారు మూడు నెలలపాటు బ్రేక్ పడిన నేపథ్యంలో బంగారం ధరలు తగ్గవచ్చునని వ్యాపారులు సైతం ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది మే నెల నుంచి బంగారం ధరలు రోజురోజుకు పెరుగుతుండడంతో వ్యాపారం అంతంతమాత్రంగానే ఉంటుందని చిరు బంగారు వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దానికితోడు బడా వ్యాపార సంస్థలు బంగారం కొనుగోళ్లపై సైతం ఆఫర్లు ప్రకటించి చిరు వ్యాపారులకు కొద్దిపాటి వ్యాపారం కూడా లేకుండా చేస్తున్నారని వాపోతున్నారు. గతంలో ఎన్నడూలేనివిధంగా ఈ ఏడాది బంగారం ధరలు చుక్కలనంటాయి. 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1.35లక్షలకు పెరిగింది. 22 క్యారట్ల బంగారం ధర రూ.1.21లక్షలకు పెరిగింది. ప్రస్తుతం బంగారం ధరల్లో ఎగుడుదిగుడులు కొనసాగుతూ కాస్తంత తగ్గి ప్రస్తుతం 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1.27 లక్షల వద్ద ఉంది. 2023 నవంబరు నెలలో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.60వేలు ఉండగా ఈ ఏడాది ఇదే నెలలో రూ.1.27 లక్షలు ప్రస్తుతం ఉంది. అప్పట్లో 22 క్యారట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.55,400 కాగా ప్రస్తుతం రూ.1.17లక్షల వద్ద ఉంది. రానున్న శుక్ర మౌఢ్యమిలోనైనా బంగారం ధరకు కళ్లెం పడుతుందని అన్నివర్గాల ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు. కాగా బండారులంక సిద్ధాంతి కాలెపు భీమేశ్వరరావు మాట్లాడుతూ ఈనెల 26 నుంచి శుక్రమౌఢ్యం ప్రారంభమవుతుంది. ఈనెల 21 నుంచి డిసెంబరు 19 వరకు మార్గశిరమాసం. ఈ మాసంలో శంకుస్థాపనలు, గృహప్రవేశాలకు ముహుర్తాలు లేవు. ఈనెల 22, 23 తేదీల్లో వివాహాలకు ముహుర్తాలు ఉన్నాయి. ఈనెల 26 నుంచి శుక్రమౌఢ్యం ప్రారంభమై 2026 ఫిబ్రవరి 17 వరకు ఉంది. దాంతో 83 రోజుల శుక్రమౌఢ్యంలో వివాహాది శుభ కార్యక్రమాలు ఉండవని పేర్కొన్నారు.

వీఆర్వోలకు ఉద్యోగోన్నతి కల్పించాలి

సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు



కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌కు వినతిపత్రంతో పాటు మొక్క ఇస్తున్న వీఆర్వోల సంఘ ప్రతినిధులు

కలెక్టరేట్ (కాకినాడ), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల పరిధిలోని గ్రేడ్-1, గ్రేడ్-2 గ్రామ రెవెన్యూ అధికారులకు ఉద్యోగోన్నతి కల్పించాలని వీఆర్వోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌ను కోరారు. శుక్రవారం ఆయన కాకినాడ కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రంతో పాటు మొక్క ఇచ్చారు. ఈ సందర్భంగా రవీంద్రరాజు మాట్లాడుతూ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఖాళీగా ఉన్న సీనియర్ అసిస్టెంట్ పోస్టులను గ్రేడ్-1 గ్రామ రెవెన్యూ అధికారులతో భర్తీ చేయాలన్నారు. గ్రేడ్-2 వీఆర్వోలకు గ్రేడ్-1గా ఉద్యోగోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన కలెక్టర్ సీనియర్ అసిస్టెంట్ ఉద్యోగోన్నతులకు సంబంధించి సీనియారిటీ జాబితాను ఈ వారంలోనే పబ్లిష్ చేసి ఉద్యోగోన్నతి కల్పిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం కలెక్టరేట్ పరిపాలనాధికారి రామ్మోహన్‌రావుకు కూడా వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో వీఆర్వోల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దాల బాపూజీ, సహాయ కార్యదర్శి అనిశెట్టి రామకృష్ణ, ప్రతినిధులు మేడిశెట్టి కిషోర్, సాధనాల యల్లేశ్వరరావు, అల్లాడి మల్లేశ్, శ్రీనివాసు, కె.స్వామి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వాటర్ లిటరసీ సెంటర్లు ఏర్పాటు చేస్తాం

- పిఠాపురంలో పైలట్ ప్రాజెక్టు
- విశాఖ సీఐఐ సదస్సులో మురాలశెట్టి సునీల్‌కుమార్



పిఠాపురం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్తుతరాలకు సురక్షితమైన తాగునీరు, వ్యవసాయ, ఉద్యానవన పంటల సాగు, అక్వా కల్చర్‌కు పరిశుభ్రమైన సాగునీరు అందుబాటులో ఉండేలా చూసేందుకు వాటర్ లిటరసీ సెంటర్లను ఏపీలో నూతన ఆవిష్కరణగా ఏర్పాటు చేయనున్నట్టు గోదావరి ఈస్ట్రన్ డెల్టా ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ మురాలశెట్టి సునీల్‌కుమార్ వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో విశాఖపట్టణంలో నిర్వహించిన సీఐఐ భాగస్వామ్య సదస్సులో జాతీయ, అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో వాటర్ లిటరసీ సెంటర్ల ఏర్పాటుపై శుక్రవారం ఆయన ప్రజెంటేషన్ ఇచ్చారు. దీనిని పైలట్ ప్రాజెక్టుగా పిఠాపురంలో చేపడతామని తెలిపారు. నీటి సంరక్షణ, సస్టైనబుల్ ప్రాక్టీసెస్, భూగర్భ జలాల నిర్వహణ, నీటి కాలుష్యాన్ని తగ్గించడం, నీటివనరుల పరిరక్షణ, టెక్నాలజీ ఇంప్లిమెంటేషన్, ప్లాస్టిక్ అండ్ ఇండస్ట్రియల్ వేస్ట్ మేనేజ్‌మెంట్, వర్క్‌షాపుల నిర్వహణ తదితర అంశాలను ఈ సెంటర్ చేపడుతుందని వివరించారు. సోషల్ మీడియా ద్వారా ప్రచారం, కళాశాల, పాఠశాల విద్యార్థులకు అవగాహన పెంచే విధంగా క్షేత్రస్థాయి పర్యటనల ఏర్పాటు, సర్టిఫికేషన్ కోర్సులు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కాన్సెప్ట్ వినూత్నంగా ఉందని పలువురు ప్రతినిధులు అభినందించారు. తనకు అవకాశం కల్పించిన సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లకు సునీల్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.



సహకార పతాకాన్ని ఆవిష్కరిస్తున్న రామస్వామి

రైతుల సంక్షేమానికి కృషి చేయాలి

సహకార వారోత్సవాల ప్రారంభోత్సవంలో డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి

కాకినాడ రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీసీసీబీ ఛైర్మన్ తుమ్మల రామస్వామి కోరారు. 72వ అఖిల భారత సహకార వారోత్సవాలను కాకినాడలోని డీసీసీబీ కేంద్ర కార్యాలయం వద్ద శుక్రవారం ఆయన ప్రారంభించారు. సహకార సప్తవర్ణ పతాకాన్ని ఆవిష్కరించి అధికారులు, సిబ్బందితో సహకార ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ డీసీసీబీకి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. చిన్న, సన్నకారు రైతులు, బడుగు, బలహీన వర్గాల శ్రేయస్సు కోసం సహకార వ్యవస్థ ఏర్పడిందన్నారు. సహకార వారోత్సవాలు దేశవ్యాప్తంగా సహకార ఉద్యమ అభివృద్ధికి నాంది పలుకుతాయన్నారు. ప్రతి సొసైటీ ప్రగతి పథంలో నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సహకార వారోత్సవాల జిల్లా ఇన్‌చార్జి ఆదిమూలం వెంకటేశ్వరరావు, డీజీఎం శ్రీధర్‌చౌదరి, డీసీవో శ్రీనివాస రెడ్డి, ఏజీఎంలు, మేనేజర్లు, అధికారులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.



శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానం

ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా

పిఠాపురం

- 19 ఆలయాల అభివృద్ధికి రూ.20 కోట్లు
- కామన్ గుడ్ ఫండ్ నిధుల విడుదలకు దేవదాయ శాఖ అంగీకారం
- అందులో పాదగయ క్షేత్రానికి రూ.6 కోట్లు, శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానం అభివృద్ధికి రూ.2 కోట్లు కేటాయింపు



పాదగయ క్షేత్రం



ప్రణాళికను వేగవంతంగా అమలు చేయాలి: డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

దేవదాయ శాఖ ఉన్నతాధికారులు, పాడా అధికారులతో సమీక్ష

పిఠాపురం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): అష్టాదశ శక్తి పీఠాల్లో దశమ శక్తి పీఠం అధిష్ఠాన దేవత అయిన పురుహూతికా అమ్మవారు, స్వయంభూ కుక్కుటేశ్వరస్వామి, శ్రీపాదశ్రీవల్లభులు పుట్టిన పిఠాపురాన్ని ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా రూపుదిద్దేందుకు ప్రణాళికను వేగవంతంగా అమలు చేయాలని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అధికారులను ఆదేశించారు. పాదగయ క్షేత్రం, శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానం తదితర ప్రధాన ఆలయాలతో పాటు 19 దేవాలయాల అభివృద్ధికి సీజీఎఫ్ నిధులు రూ.20 కోట్లు విడుదల చేసేందుకు దేవదాయ శాఖ అంగీకరించిందని వెల్లడించారు. పవన్‌కల్యాణ్ శుక్రవారం మంగళగిరిలోని తన క్యాంపు కార్యాలయం నుంచి దేవదాయ శాఖ ఉన్నతాధికారులు, పిఠాపురం పాడా అధికారులతో సమీక్ష నిర్వహించారు. కుక్కుటేశ్వరస్వామి, పురుహూతికా ఆలయాల అభివృద్ధికి రూ.6కోట్లు వెచ్చించనున్నామని, ఈ నిధులతో పిండప్రదాన మందిరం, అన్నదాన మండపం నిర్మాణంతో పాటు పాదగయ పుష్కరిణి మరమ్మతులు చేపడతామని వివరించారు. ఈ పనుల నిర్వహణకు దేవదాయ శాఖ ఆమోదం లభించిందన్నారు. శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానం అభివృద్ధికి రూ.2కోట్లు మంజూరయ్యాయన్నారు. సీతారామాంజనేయ స్వామి ఆశ్రమం అభివృద్ధికి రూ.60లక్షలు, జైగణేష్ ఆలయ అభివృద్ధికి రూ.65లక్షలు, చిత్రాడలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి రూ.70లక్షలు వెచ్చించనున్నామని చెప్పారు. పురుహూతికా అమ్మవారు, కుక్కుటేశ్వరస్వామి ఆలయాలు, శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు సమగ్ర ప్రాజెక్టు తయారు చేస్తున్నట్టు తెలిపారు. టెంపుల్ టూరిజంలో భాగంగా మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామన్నారు.

పిఠాపురం మండలం నవఖండ్రవాడలోని నక్కుళ్లమ్మ ఆలయం, రామాలయం, గొల్లప్రోలులోని సిరితల్లి ఆలయం, తాటిపర్తిలోని మార్కండేయ సమేత భద్రావతి భావనారుషి ఆలయాలను ధూప, దీప, నైవేద్యం పథకం పరిధిలోకి తీసుకునేందుకు దేవదాయ శాఖ అంగీకారం తెలిపిందన్నారు. సనాతన ధర్మానికి ప్రతీకగా నిలిచే ఆలయాల పరిరక్షణ అందరి బాధ్యత అన్నారు. నిధుల మంజూరు అంగీకారం తెలిపిన దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి పవన్ కృతజ్ఞతలు తెలిపారు. కార్తీకం చివరి సోమవారం, మాసం ముగిసే రోజున భక్తుల తాకిడి అధికంగా ఉంటుందని, అందుకు తగ్గ ఏర్పాట్లు చేయాలని పవన్‌కల్యాణ్ అధికారులను ఆదేశించారు. ఆలయాల వద్ద పోలీసు బందోబస్తు పటిష్టంగా ఉండాలని సూచించారు.

వాడపల్లి వెంకన్న ఆలయానికి రెండు బ్యాటరీ కార్లు

బహూకరించిన విక్టరీ సంస్థ అధినేత వెంకటరెడ్డి



బ్యాటరీ కారును ప్రారంభించిన అనంతరం స్వయంగా నడుపుతున్న కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

ఆత్రేయపురం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి విచ్చేసే భక్తుల సౌకర్యార్థం రావులపాలేనికి చెందిన విక్టరీ సంస్థ అధినేత గొలుగూరి వెంకటరెడ్డి రూ.20లక్షలతో రెండు బ్యాటరీ కార్లను కొనుగోలు చేశారు. వీటిని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు శుక్రవారం ప్రారంభించారు. తొలుత ఎమ్మెల్యే, దాతలు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల సౌకర్యార్థం ఈ వాహనాలను వినియోగిస్తామని దేవస్థానం ఛైర్మన్ ముదునూరి వెంకట్రాజు, ఉప కమిషనరు నల్లం సూర్యచక్రధర రావు తెలిపారు. అనంతరం గ్రామంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, దాతలు పాల్గొన్నారు.

ఆపరేషన్ గోదారి

విజ్జేశ్వరం స్కవర్ స్లూయిజ్ నుంచి మురుగునీరు విడుదల

నిడదవోలు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): గోదావరి నదికి వరదలు వచ్చే వేళ ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరద నీటిలో కొట్టుకు వచ్చే మట్టి, చెత్తాచెదారాలు గోదావరి నది బ్యారేజీలో ఒక ప్రత్యేక బ్లాక్‌లోకి వెళ్లే విధంగా ఆనాడు కాటన్ మహాశయుడు గోదావరి నదిపై బ్యారేజ్ నిర్మించాడు.ప్రతి ఏడాది ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు దిగువకు కొట్టుకు వచ్చే మట్టి, చెత్త విజ్జేశ్వరం బ్యారేజీ వద్ద బ్లాక్‌కు చేరుతుంది. దీనిని నీటి పారుదల శాఖాధికార్లు ఏడాదికి ఒకసారి స్కవర్ స్లూయిజ్ ఆపరేషన్ పేరుతో 4గేట్లను పైకెత్తి దిగువకు విడుదల చేస్తారు. శుక్రవారం నిడదవోలు మండలం విజ్జేశ్వరం వద్ద హెడ్ వర్క్స్ ఈఈ జి.శ్రీనివాసరావు స్విచ్చాన్ చేసి స్కవర్ స్లూయిజ్ ఆపరేషన్ ప్రారంభించారు. ఈ ఆపరేషన్ ద్వారా 4 గేట్లు పైకెత్తి సుమారు 11.401 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. కార్యక్రమంలో కె.ఆనంద్‌బాబు, డి.రాధాకృష్ణ, ఆర్.సునీల్‌బాబు, జి.జయవిక్రమ్, జి.రాజేష్, ఎ.మీరాబాబు పాల్గొన్నారు.



విజ్జేశ్వరం బ్యారేజ్ వద్ద నుంచి స్కవర్ స్లూయిజ్ ఆపరేషన్ ద్వారా బయటకు వెళుతున్న మురుగునీరు



స్కవర్ స్లూయిజ్ స్విచ్చాన్ చేస్తున్న ఈఈ శ్రీనివాసరావు

ఓఎన్జీసీతో మత్స్యకారుల ఉపాధికి ఇబ్బంది రాకూడదు

కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్ (కాకినాడ), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఓఎన్జీసీ పైపులైన్ల వల్ల మత్స్యకారుల జీవనోపాధికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. గత ఆగస్టు 22న ఓఎన్జీసీ అగ్ని ప్రమాదంతో మత్స్య సంపదకు, మత్స్యకారుల జీవనోపాధికి జరిగిన నష్టాన్ని అంచనా వేయడానికి ఏర్పాటుచేసిన సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ సైంటిస్ట్ డాక్టర్ జోయ్‌తో కలిసి ఆయన కాకినాడ కలెక్టరేట్‌లో శుక్రవారం సమీక్షించారు. యానాం పరిపాలనా అధికారి అంకిత్,రాష్ట్ర ప్రభుత్వ విప్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు, కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ మత్స్యకారులకు ఏ నష్టం కలగకుండా అన్ని చర్యలూ తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యే దాట్ల మాట్లాడుతూ సముద్రంలో మత్స్య సంపద గతం కంటే ఇప్పుడు గణనీయంగా తగ్గిందన్నారు. ఇలాంటి అగ్ని ప్రమాదాల వల్ల ప్రజల్లో భయాందోళనలు కలుగుతాయని, వారికి నమ్మకం కల్గించే లా కంపెనీలు వ్యవహరించాలన్నారు. ఎమ్మెల్యే కొండబాబు మాట్లాడుతూ ఓఎన్జీసీ అగ్ని ప్రమా దంతో ఏర్పడిన కాలుష్యం కాకినాడ తీర ప్రాంతానికి చేరుకుని మత్స్యకారుల జీవనోపాధి దెబ్బ తీసిందన్నారు. గతంలో ఓఎన్జీసీ, జీఎస్పీసీ పరిహారం కాకినాడ మత్స్యకారులకు ఇవ్వలేదన్నారు. ఈసారి మత్స్యకారులకు కూడా పరిహారం ఇచ్చి ఆదుకోవాలన్నారు. సమావేశంలో ఓఎన్జీసీ ఈడీ ప్రబల్ సేన్‌గుప్తా, జిల్లా మత్స్య శాఖ అధికారి కృష్ణారావు పాల్గొన్నారు.

రెవెన్యూ జట్టుకు అభినందనలు

అనంతపురంలో ఈ నెల 7,8,9 తేదీల్లో జరిగిన 7వ రాష్ట్ర స్థాయి రెవెన్యూ క్రీడల్లో కాకినాడ జట్టు 30 పాయింట్లతో రాష్ట్ర స్థాయిలో మూడో స్థానం సాధించింది. ఈ నేపథ్యంలో కాకినాడ కలెక్టరేట్‌లో శుక్రవారం కాకినాడ రెవెన్యూ క్రీడాకారుల జట్టును కలెక్టర్ షాన్‌మోహన్ అభినందించారు. మార్చ్‌ఫాస్ట్ విభాగంలో కాకినాడ జిల్లా జట్టు ప్రథమ, పురుషుల విభాగంలో టగ్ ఆఫ్ వార్‌లో ప్రథమ, 100 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ, చదరంగంలో ద్వితీయ, త్రోబాల్‌లో ద్వితీయ స్థానాల్లో నిలిచింది. ఈ సందర్భంగా క్రీడలకు సహకారం అందించిన కలెక్టర్‌కు జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు, కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు మల్లిబాబు, శ్రీరమణి, ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు త్రినాథరావు, అసోసియేట్ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, రామ్మోహన్‌రావు, వీరబాబు, తహశీల్దారు గోపాలకృష్ణ ధన్యవాదాలు తెలిపారు.

భార్యపై అనుమానంతో ఇంటికి నిప్పు

» మంటలను అదుపు చేసిన స్థానికులు » భర్త అరెస్టు » ఈదరపల్లిలో ఘటన

అమలాపురం రూరల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): భార్యపై అనుమానం పెంచుకున్న భర్త గురువారం అర్ధరాత్రి దాటిన తరువాత ఆమె ఉంటున్న ఇంటికి నిప్పు పెట్టి చంపాలని ప్రయత్నించాడు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం రూరల్ మండలం ఈదరపల్లి పోలేరమ్మ గుడి సెంటర్‌కు చెందిన విజయ దుర్గాభవానీకి అమలాపురానికి చెందిన జంగా శివ అలియాస్ సురేష్‌తో వివాహం జరిగింది. వీరికి ముగ్గురు సంతానం. దుర్గాభవానీ తల్లికి ఆరోగ్యం బాగోకపోవడంతో పిల్లలతో కలిసి కొన్ని రోజుల క్రితం పుట్టింటికి ఈదరపల్లి వచ్చింది. అప్పటికే భార్యపై అనుమానం పెంచుకున్న శివ రాత్రి 1 గంట సమయంలో పెట్రోల్ సీసాలతో ఆ ఇంటికి చేరుకున్నారు. కిటికీల నుంచి లోనికి పెట్రోల్ పోసి నిప్పంటించాడు. దాంతో ఒక్కసారిగా మంటలు రేగడంతో ఉలిక్కిపడ్డ భవానీ కుటుంబ సభ్యులు పెద్దపెద్ద కేకలు వేసి బయటకు పరుగులు తీశారు. అప్పటికే చుట్టుపక్కల వారు రావడం, స్థానికుల సహకారంతో మంటలను అదుపు చేశారు. శివ వంట గదిలోకి పెట్రోల్ సీసా విసరడంతో మంటలు గ్యాస్ సిలిండర్ వద్దకు చేరుకుంటున్న సమయంలో అదుపు చేయడం వల్ల పెను ప్రమాదం తప్పింది. సమాచారం తెలుసుకున్న పట్టణ ఎస్ఐ కిశోర్‌బాబు ఆధ్వర్యంలో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పారిపోయేందుకు ప్రయత్నిస్తున్న శివను అదుపులోకి తీసుకున్నారు. భవానీ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

వంటింట్లో దహనమైన సామగ్రి →



యానాంలో ఫ్రాన్స్ అంబాసిడర్ పర్యటన



ఫ్రాన్స్ అంబాసిడర్ మాత్యో చర్చిస్తున్న ఆర్ఏ అంకిత్‌కుమార్

యానాం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): యానాం నియోకజవర్గంలో ఫ్రాన్స్ అంబాసిడర్ థియరీ మాథౌ పర్యటించారు. రెండురోజుల పర్యటనలో భాగంగా ఆయన యానాం వచ్చారు. పుదుచ్చేరి నుంచి యానాం వచ్చిన ఆయనకు ప్రభుత్వ అతిథి గృహం వద్ద యానాం పరిపాలనాధికారి అంకిత్‌కు మార్, ఎస్పీ వరదరాజన్ తదితరులు ఘనంగా స్వాగతం పలికి శాలువాలతో సత్కరించారు. అనంతరం యానాంలోని పలు పర్యాటక ప్రాంతాలను పరిశీలించారు. ఫ్రెంచ్ సంస్కృతిలోని భావోద్వేగాలు, జీవన విధానం, చలనచిత్ర రీతుల్ని తెలియజేయడం కోసం స్థానిక పాలిటెక్నిక్ కళాశాల కాన్ఫరెన్స్ హాల్లో మూడు రోజులపాటు ఫ్రెంచ్ చలన చిత్రోత్సవం నిర్వహించనున్న నేపథ్యంలో మాత్యో యానాం పర్యటనకు వచ్చారు.

నరసన్న ఆలయంలో రూ.లక్ష టిక్కెట్ కౌంటర్



కౌంటర్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న దాతలు, అధికారులు, అర్చకులు

అంతర్వేది, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): నవ నారసింహ క్షేత్రాల్లో ఒకటైన అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పాలకొల్లుకు చెందిన వాకాడ అప్పారావు-విశాలాక్షి దంపతులు దేవస్థానం వినియోగార్థం సుమారు రూ. లక్ష విలువైన టిక్కెట్ కౌంటర్‌ను ఏర్పాటుచేశారు. ముందుగా అర్చకులు టిక్కెట్ కౌంటర్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించగా దాతలు ప్రారంభోత్సవం చేశారు. అనంతరం దాతలకు వేదాశీర్వచనం చేసి స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందించినట్టు ఆలయ సహాయ కమిషనర్ ఎంకేటీఎన్వీ ప్రసాద్ తెలిపారు.

వలలో పడి మత్స్యకారుడి మృతి



మృతుడు కృష్ణ

కొత్తపల్లి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): సముద్రంపైకి చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుడు దురదృష్టవశాత్తూ వల వేసేటప్పుడు కాలు జారీ వలలో చిక్కుకొని మృతి చెందిన సంఘటన కాకినాడ జిల్లా ఉప్పాడ తీరంలో జరిగిది. ఉప్పాడ సర్పంచ్ ఉమ్మిడి మేరీజాన్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉప్పాడ శివారు జగరాజుపేటకు చెందిన కారే కృష్ణ(48) అదే గ్రామానికి చెందిన పిరమాళ్ల దుర్గా ప్రసాద్‌కు చెందిన జాయింట్ బోట్లపై శుక్రవారం ఉదయం మరో 20 మందితో కలిసి ఉప్పాడ మినీ హార్బర్ నుంచి వేటకు వెళ్లారు. చేపలను వేటాడేందుకు వలను సముద్రంలోకి విసిరేటపుడు బోటు నుంచి కాలుజారి వలకు చిక్కుకొని సముద్రంలో గల్లంతయ్యాడు. బోటులో వేటకు వెళ్లిన మత్స్యకారులు సహచర మత్స్యకారులతో సముద్రంలో గాలింపు చేపట్టారు. కృష్ణ మృతదేహం కాకినాడ సమీపంలో హార్బర్‌లో లభ్యమైందని సర్పంచ్ మేరీ జాన్ తెలి పారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కొత్తపల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీ నేతను గాయపర్చిన వ్యక్తికి రిమాండ్

ఆత్రేయపురం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురానికి చెందిన టీడీపీ నేత దేవస్థానం చైర్మన్ వేగేశ్న ప్రసాద్‌రాజును కొట్టి గాయపర్చిన వేగేశ్న గోపిరాజుపై పోలీసులు కేసు నమోదు చేశారు. గత సెప్టెంబరు నెలలో డబ్బులు విషయంలో ప్రసాద్‌రాజు, గోపిరాజు మధ్య వాగ్వాదం జరిగి కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. ఈ క్రమంలో ప్రసాద్‌రాజును గోపిరాజు కొట్టి గాయపర్చాడు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. శుక్రవారం గోపిరాజును అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పర్చగా 14 రోజులు రిమాండ్ విధించినట్టు పోలీసులు తెలిపారు.

పాము కాటుతో మహిళ మృతి

ఆత్రేయపురం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పాము కాటుతో ఓ మహిళ మృతిచెందింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వెలిచేరు గ్రామానికి చెందిన పల్లికొండ కుమారి(40) గురువారం రాత్రి పక్కంటి వారికి పాలు ఇవ్వ డానికి వెళ్తుండగా పాము కాటు వేసినట్టు అనిపించడంతో భర్త అన్నవరానికి తెలియజేసింది. వెంటనే రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే ఆమె మృతి చెందినట్టు ధ్రువీకరించారు. ఆసుపత్రి నుంచి అందిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఎస్.రాము తెలిపారు.

తల్లికి బాలిక అప్పగింత

ఆత్రేయపురం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలం ర్యాలీ గ్రామానికి చెందిన 17 ఏళ్ల బాలిక ఈనెల 13న ఇంటి నుంచి వెళ్లిపోయింది. దీంతో ఆమె తల్లి పోలీసులను ఆశ్రయించింది. సీఐ విద్యాసాగర్ తన సిబ్బందితో బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు.బాలిక తిరుపతిలో ఉన్నట్టు గుర్తించి సురక్షితంగా ఆమెను కుటుంబ సభ్యులకు అప్పగించారు.

కాకినాడ

కట్టమూరులో వైభవంగా లక్ష బిల్వార్చన

పెద్దాపురం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కట్టమూరులో రాజరాజేశ్వరీ సమేత రామలింగేశ్వరస్వామి దేవాలయంలో కార్తీక బహుళ దశమిని పురస్కరించుకుని లక్ష బిల్వార్చనను శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు కొత్తలంక శివరామ్మూర్తి ఆధ్వర్యంలో వేద పండితులు స్వామివారికి సుగంధభరిత పుష్పాలతో అర్చన జరిపారు. సాయంత్రం మహా మంగళహారతి, దీపోత్సవం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.


కాకినాడలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ మనీషా


పిఠాపురంలో జాతీయ నాయకుల వేషధారణలో విద్యార్థులు


సామర్లకోటలో మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కమిషనరు శ్రీవిద్య

గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం

విద్యార్థులు చిన్నతనం నుంచే పఠనంపై ఆసక్తి పెంచుకోవాలని అసిస్టెంట్ కలెక్టర్ మనీషా పిలుపు

కాకినాడ సిటీ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చిన్నతనం నుంచే పఠనంపై ఆసక్తి పెంచుకోవాలని, చదివే తరగతి పుస్తకాలతో పాటు లోకజ్ఞానంపై అవపోసన పట్టాలని అసిస్టెంట్ కలెక్టర్ మనీషా పేర్కొన్నారు. కాకినాడ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా విచ్చేసిన అసిస్టెంట్ కలెక్టర్ మాట్లాడుతూ పుస్తక పఠనం ద్వారా భవిష్యత్తులో అవసరమయ్యే జ్ఞానసము పార్జనకు పునాదులు వేసుకోవాలన్నారు. జిల్లా ఉప విద్యా శాఖాధికారి కేవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ వివిధ రకాల పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలు గ్రంథాలయాల్లో అందుబాటులో ఉంటాయన్నారు. రాష్ట్ర కాపు వెల్ఫేర్, డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్, టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, కాకినాడ మార్కెట్ కమిటీ చైర్మన్ బచ్చు శేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కేంద్ర గ్రంథాలయ ఉప గ్రంథాలయాధికారి కె.కిషోర్, కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ ఎం.శ్రావ్య, సిబ్బంది పాల్గొన్నారు.

కరప (ఆంధ్రజ్యోతి): వేళంగి శాఖ గ్రంథాలయాధికారి పాట్నీడి వెంకటరంగయ్య ఆధ్వర్యంలో మాజీ ప్రధాని నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పించి విద్యార్థులకు బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యదర్శి పినిశెట్టి వీరభద్రరావు, హైస్కూలు హెచ్‌ఎం క్షేత్రిమూర్తులు, బాలరాజు, కొండేపూడి రాంబాబు, చక్కా నూకరాజు, కనకాల శ్రీనివాస్, వేళంగి గ్రాడ్యుయేట్స్ యూత్ సభ్యుడు ఎర్రా విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దాపురం (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలను మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసిమంగతాయారు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ ప్రారంభించారు. విద్యార్థుల స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణ విశేషంగా ఆకట్టుకుంది. గ్రంధిలయాధికారి పాలంకి నాగరాజు, జడ్పీటీసీ గవరసాన సూర్యచక్రరావు, సిబ్బంది, సింగం బుల్లియ్య, పాఠకులు పాల్గొన్నారు.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాధికారి బందిల రత్నమణి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి కమిషనరు శ్రీవిద్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రధానోపాధ్యాయులు బాలమురళీకృష్ణ, కొమ్ముల శివశంకర్, వెంకటరమణ, ప్రసాద్ పాల్గొన్నారు.

తాళ్లరేవు (ఆంధ్రజ్యోతి): కోరింగ గ్రంథాలయంలో లైబ్రేరియన్ కనికెళ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి మాజీ జడ్పీటీసీ పొన్నమండ రామలక్ష్మి హాజరయ్యారు. నెహ్రూ చిత్రపటానికి చిన్నారులు, నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. హెచ్‌ఎం చంటిబాబు, వీఆర్వో చిన్ని, గ్రామ పెద్దలు సిద్దన రామకృష్ణ, రేవు వాసు, పొన్నాడ శ్రీను, రాపర్తి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కొత్తపల్లి (ఆంధ్రజ్యోతి): ఉప్పాడ, కొత్తపల్లి శాఖా గ్రంథాలయాల్లో సరస్వతీదేవి చిత్రపటానికి గ్రంథాలయ అధికారులు తుమ్మలపల్లి జయకృష్ణ, తెలగంశెట్టి నళినీప్రియ పూలమాలలు వేశారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథాలయాలను తప్పక వినియోగించుకుంటామని పాఠకులు, గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పిఠాపురం (ఆంధ్రజ్యోతి): పిఠాపురం శాఖా గ్రంథాలయంలో వేషధారణ పోటీలు నిర్వహించారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సరస్వతీ దేవికి పుష్పాలు సమర్పించారు. పిఠాపురం ఎంఈవో గంటా శ్యాంబాబు, మున్సిపల్ కౌన్సిలర్ నల్లా రమణమ్మ, ఓటీఎస్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం సుబ్రహ్మణ్యం, గ్రంథాలయాధికారి వెంకటరాము తదితరులు పాల్గొన్నారు.


తాళ్లరేవు, ఉప్పాడ, కొత్తపల్లిల్లో గ్రంథాలయాలను వినియోగించుకుంటామని ప్రతిజ్ఞ చేస్తున్న పాఠకులు, విద్యార్థులు



సహకార వారోత్సవాలు ప్రారంభం

కరప, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలో సహకార వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. పెనుగుదురు, జడ్.బావారం, కరప, వేములవాడ, కూరాడ, పెద్దాపురప్పాడు, యండమూరుల్లోని సొసైటీ కార్యాలయాల వద్ద చైర్‌పర్సన్లు రెడ్డిపల్లి నారాయణరావు, గంటా వీరన్నచౌదరి, సైనవరపు భవానీశంకర్, దూడల నారాయుడు, వెలుగుబంట్ల సూరిబాబు సహకార జెండాలను ఆవిష్కరించారు. సీఈవోలు పడాల నాగేశ్వరరావు, రాయుడు వెంకటేశ్వరరావు, ఎస్‌జే చంద్రశేఖర్, నల్లా వెంకటేశ్వరరావు, బి.పరశురామ్, కోలా త్రిమూర్తులు, డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దాపురం (ఆంధ్రజ్యోతి): మండలంలోని కట్టమూరు పీఏసీఎస్‌లో సహకార వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. సీఈవో శానపల్లి నాగభూషణం ఏడు రంగుల సహకార పతాకాన్ని ఆవిష్కరించి సహకార ప్రతిజ్ఞ చేయించారు. సిబ్బంది, రాజమండ్రి హిమశేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

కంటి ఆరోగ్యంపై అవగాహన

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పిల్లల్లో వేగంగా పెరుగుతున్న మయోపియా (దూరం చూపు సమస్య)పై కాకినాడ మాక్సీవిజన్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. పిల్లలు ఎక్కువ సమయం మొబైల్ స్క్రీన్ ముందు గడపడం వల్ల, బహిరంగ ఆటలు తగ్గిపోవడం వల్ల మయోపియా కేసులు పెరుగుతున్నాయన్నారు. పిల్లల కంటివ్యాధుల నిపుణురాలు డాక్టర్ హారిక ప్రియంవద మాట్లాడుతూ కంటి ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ జాగ్రత్త తీసుకోవాలన్నారు. క్లస్టర్ హెడ్ అఖిల్ మాట్లాడుతూ 20 సంవత్సరాలలోపు వారికి ఈ నెల నెలాఖరు వరకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు.

రాజబ్బాయికి విద్యార్థుల సత్కారం

పెద్దాపురం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆర్బీ పట్నం హైస్కూలు అభివృద్ధికి అత్యధికంగా ఆర్థిక సహకారం అందించిన మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ముత్యాల వీరభద్రరావును విద్యార్థులు శుక్రవారం సత్కరించారు. హెచ్‌ఎం మూర్తి, ఎస్‌ఎంసీ చైర్మన్ మన్యం చిన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గొల్లల మామిడాడలో వనసమారాధన

పెదపూడి (కరప), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గొల్లల మామిడాడలో చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో శుక్రవారం కార్తీక వనసమారాధన జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన అనపర్తి ఎమ్మెల్యే ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కార్తీక దామోదరుడికి పూజలు జరిపి సహపంక్తి భోజనం చేశారు. పలు ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. పెదపూడి మండల కూటమి నాయకులు, చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు పాల్గొన్నారు.




కాకినాడలో బీజేపీ సీనియర్ నేత కృష్ణమోహన్‌కి స్వీటు తినిపిస్తున్న జిల్లా అధ్యక్షుడు విశ్వేశ్వరరావు, కొత్తపల్లిలో సంబరాల్లో పాల్గొన్న నాయకులు

బిహార్‌లో విజయం... బీజేపీ సంబరాలు

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించడంతో కాకినాడలో ఆ పార్టీ శ్రేణులు శుక్రవారం విజయోత్సవాలు నిర్వహించాయి. బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు మాట్లాడుతూ ఈ విజయం ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంపై ప్రజల విశ్వాసానికి నిదర్శనమన్నారు. ఏపీలో పార్టీ మరింత బలపడేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఫైడా కృష్ణమోహన్, యెనిమిరెడ్డి మాలకొండయ్య, విశ్వనాథపల్లి శ్రీనివాసరాజు, ఫైడా భావనప్రసాద్, కుండల సాయికుమార్‌యాదవ్, పెండెం శ్రీదేవి, మొసలిగంటి సురేష్, జ్యోతుల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి (ఆంధ్రజ్యోతి): బీజేపీ కొత్తపల్లి మండల శాఖ అధ్యక్షుడు పంపన శేషగిరి నాయకత్వంలో ఊర చెరువు సెంటర్లో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. గ్రామస్తులకు, ప్రయాణికులకు స్వీట్లు పంపిణీ చేశారు. సంబరాల్లో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రవణం సుబ్రహ్మణ్యం, సీనియర్ నేత మేడసాని వరలక్ష్మీనారాయణ, జొన్నాదుల గౌరీశంకర్, గుత్తుర్తి పెద్దియ్య తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురం/పిఠాపురం రూరల్ (ఆంధ్రజ్యోతి): మండలంలోని కందరాడలో బీజేపీ నాయకులు ర్యాలీ నిర్వహించి ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు. పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి గండి కొండలరావు, జిల్లా ఉపాధ్యక్షుడు రవణం సుబ్రహ్మణ్యం, కార్యదర్శి సైతన సత్యకుమారి, దాట్ల వెంకట సూర్యనారాయణరాజు పాల్గొన్నారు. పిఠాపురం వీధుల్లో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఉప్పాడ సెంటర్లో స్వీట్లు పంచారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

సర్పవరం జంక్షన్ (ఆంధ్రజ్యోతి): సర్పవరం జంక్షన్‌లో బీజేపీ కాకినాడ పార్లమెంటరీ కో-ఆర్డినేటర్ రంబాల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో బాణసంచా కాల్చి, కార్యకర్తలకు స్వీట్లు పంచి సంబరాలు చేసుకున్నారు. నాయకులు బొలిశెట్టి రామకృష్ణ, ఎర్రమనేడి పద్మావతి, పాలుపల్లి లక్ష్మణరావు, పాలిక శివ, కండిలి వెంకట్, వీరబాబు, సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.




కాకినాడ రూరల్ సర్పవరం జంక్షన్‌లో బీజేపీ నేతల సంబరాలు, పిఠాపురం మండలం కందరాడలో విజయోత్సవంలో పాల్గొన్న ఇన్‌చార్జి కొండలరావు




కాకినాడ జేఎన్టీయూలో నెహ్రూ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న రిజిస్ట్రార్ శ్రీనివాసరావు (ఎడమ) నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేస్తున్న కేంద్ర మాజీ మంత్రి పళ్లంరాజు, కాంగ్రెస్ నేతలు (కుడి)

ఘనంగా నెహ్రూ జయంతి... బాలల దినోత్సవం

కాకినాడ సిటీ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మాదేపల్లి సత్యానందరావు, సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు చెక్కా నూకరాజు ఆధ్వర్యంలో శుక్రవారం కుళాయి చెరువు సెంటర్‌లోని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ విగ్రహం వద్ద ఆయన 135 జయంతి నిర్వహించారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ప్రత్యేక ఆహ్వానితుడు, కేంద్ర మాజీ మంత్రి మల్లిపూడి మంగపతి పళ్లంరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఏఐసీసీ సభ్యుడు, పీసీసీ జనరల్ సెక్రటరీ మల్లిపూడి రాంబాబు, పీసీసీ సభ్యుడు పోలిశెట్టి శ్రీనివాస్, పెద్దాపురం ఇన్‌చార్జి మలకల సూరిబాబు, కాకినాడ రూరల్ ఇన్‌చార్జి పిల్లి సత్యలక్ష్మీచిన్న, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షుడు తాళ్లూరి రాజు, పబ్బినీడి కృష్ణ, అబ్బిరెడ్డి అప్పారావు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మొయ్యేటి సూర్యప్రకాష్, జిల్లా నాయకులు దవులూరి లలితధనకోటి, ముమ్మిడి సత్యనారాయణ, బుర్రా పద్మనాభం, పిట్టా అర్జున్, వైఎస్ రామచంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.

జేఎన్టీయూకే (ఆంధ్రజ్యోతి): పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ఆశయాలను సాకారం చేసేందుకు విద్యార్థులు కృషి చేయాలని జేఎన్టీయూకే రిజిస్ట్రార్ ఆర్.శ్రీనివాసరావు కోరారు. వర్సిటీ ఆవరణలోని నెహ్రూ విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ మోహన్‌రావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కరప (ఆంధ్రజ్యోతి): వేములవాడ మోయిన్ స్కూల్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాలల దినోత్సవం నిర్వహించారు. మాజీ ప్రధాని నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేశారు. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కె.అన్నపూర్ణ, లక్ష్మి, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

పెద్దాపురం (ఆంధ్రజ్యోతి): జవహర్ నవోదయ విద్యాలయలో జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి ప్రిన్సిపాల్ బి.సీతాలక్ష్మి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, వేషధారణలు ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయురాలు హేమలత, లైబ్రేరియన్ రాజ్యలక్ష్మి, సనపల సత్యనారాయణ, ఎం.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అయోధ్యరామపురం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు తోటకూర సాయి రామకృష్ణ ఆధ్వర్యంలో బాలల దినోత్సవ వేడుకలు జరిగాయి. వివిధ అంశాల్లో నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులను ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈవో పుల్లయ్య అందజేశారు. కౌన్సిలర్ బలుసు శ్రీనివాసు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఆటో డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గడియార స్తంభం ఎదురుగా గల నెహ్రూ విగ్రహం వద్ద జయంతి నిర్వహించారు. సామర్లకోట సీఐ కృష్ణభగవాన్, ట్రాఫిక్ ఎస్ఐ అడపా గరగారావు, టీడీపీ పట్టణ శాఖ గౌరవాధ్యక్షుడు అడబాల కుమారస్వామి, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ బడుగు శ్రీకాంత్, జనసేన నాయకులు మంచెం సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురం (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భాష్యం స్కూలులో సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులు నెహ్రూ వేషధారణలో అలరించారు. ప్రిన్సిపాల్ పోలుపర్తి వేణు, ప్రైమరీ స్కూలు ప్రధానోపాధ్యాయురాలు అరుణ తదితరులు పాల్గొన్నారు. ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పోటీల్లో విజేతలకు ప్రిన్సిపాల్ వి.కేశవరావు బహుమతులు అందజేశారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాదం మాధవరావు ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో విద్యా శాఖ, బాలల పరిరక్షణ విభాగం నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కౌన్సిలర్ దుర్గారాణి, ఎంఈవో శ్యాంబాబు, విద్యా కమిటీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, అనంత లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

గొల్లప్రోలు (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మాధురి విద్యాలయంలో పది రోజుల పాటు నిర్వహించిన పోటీల్లో విజేతలకు విద్యా సంస్థల అధినేత కదారి తమ్మయ్యనాయుడు, సీతాదేవి బహుమతులు అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ మాధవి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలపై కఠిన చర్యలు: మున్సిపల్ ఆర్డీ నాగనరసింహారావు

పెద్దాపురం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీలో అక్రమ కట్టడాలపై కఠిన చర్యలు చేపట్టాలని మున్సిపల్ ఆర్డీ నాగనరసింహారావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన మున్సిపల్ కార్యాలయంలో టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు. పట్టణంలో ఉన్న సినిమా పోస్టర్లను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రకటనల పోస్టర్లను ఎప్పటికప్పుడు తొలగించాలని, శిథిలాలను, బిల్డింగ్ మెటీరియల్ తొలగించి పల్లపు ప్రాంతాల్లో వేయాలన్నారు. అక్రమ కట్టడాలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మేజర్ డ్రైన్లలో సిల్ట్‌ను 2026 ఏప్రిల్ నాటికి తొలగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో కమిషనరు శ్రీకాంత్‌రెడ్డి, మేనేజరు జ్యోతిరాణి తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు సిద్ధంగా ఉంచాలి: డీలర్లకు వ్యవసాయ శాఖ జేడీ ఆదేశం

పెద్దాపురం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాబోయే రబీ సీజనుకు ఎరువులను సిద్ధంగా ఉంచాలని డీలర్లను వ్యవసాయ శాఖ జేడీ ఎన్.విజయకుమార్ ఆదేశించారు. శుక్రవారం ఆయన పెద్దాపురం, కిర్లంపూడిలకు చెందిన ఎరువుల డీలర్లతో సమీక్షించారు. దాళ్వా సీజనుకు కావాల్సిన ఎరువులను ముందుగానే అవసరమైనంత వరకు నిల్వ చేసుకోవాలన్నారు. రైతులకు అవసరమైన అన్ని రకాల ఎరువులను సకాలంలో అందించాలన్నారు. ఎరువులను ఎమ్మార్పీకి మించి విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి రోజూ స్టాకు రిజిస్టర్, ఈ-పోస్ మిషన్లలో ఎరువుల అమ్మకాల వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. 80శాతానికి పైగా మొలక ఉన్న విత్తనాలను మాత్రమే రైతులకు అమ్మాలని సూచించారు. పంట కోత ప్రయోగాలను శ్రద్ధతో నిర్వహించాలని వీఏఏలను ఆదేశించారు. ఏడీఏ నల్లి దైవకుమార్, ఏవో సంజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ఘనంగా ఎన్‌ఆర్‌ఐ పేరెంట్స్ సంఘం కార్తీక వనసమారాధన

సర్పవరం జంక్షన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ రమణయ్యపేట లోని ఆశ్రమ శ్రావణి వృద్ధాశ్రమంలో గల తోటలో కాకినాడ ఎన్‌ఆర్‌ఐ పేరెంట్స్ సంఘం అధ్యక్షుడు పాలగుడు సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధనను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కాకినాడ ఐటీఐ వెనుక కేన్సర్ ఆసుపత్రి బ్లాక్ నిర్మాణానికి ఎన్‌ఆర్‌ఐ ప్రెసిడెంట్ సుబ్రహ్మణ్యం, రిటైర్డు ప్రిన్సిపాల్, సభ్యుడు కాశిన వెంకటేశ్వరరావు చెరో రూ.10లక్షలు వంతున చెక్కులను రెడ్‌క్రాస్ చైర్మన్ వైడీ రామారావుకు అందించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ నిరుపేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రూ.7.08కోట్లతో కాకినాడలో కేన్సర్ ఆసుపత్రి బ్లాక్ నిర్మిస్తున్నామన్నారు. సంఘ సభ్యులు ఉల్లాసంగా గడిపారు. కష్టసుఖాలను పంచుకున్నారు. వన భోజనాలు చేశారు. పలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శి ఎన్వీపీ శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శి వేమూరి నరసింహారావు, కోశాధికారి సీవీ రామనాథం, పుట్టా సోమన్నచౌదరి, కృష్ణకుమారి, శ్రీకృష్ణదేవరాయలు, సూర్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

'హెచ్‌ఐవీ ప్రభావిత పిల్లలపై వివక్ష చూపొద్దు'

జీజీహెచ్ (కాకినాడ), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): హెచ్‌ఐవీ ప్రభావిత పిల్లల అవసరాలపై వివిధ శాఖల సమన్వయంతో డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ శుక్రవారం సమావేశం నిర్వహించారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి కార్యాలయ సమావేశ మందిరంలో హెచ్‌ఐవీ ప్రభావిత పిల్లలు, వారి కుటుంబ సభ్యులు, స్వచ్ఛంద సంస్థలు, విద్యా శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ సమన్వయ సమావేశం నిర్వహించారు. బాధిత పిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని పరిష్కారాలను తెలుసుకునే లక్ష్యంతో 35 మంది పిల్లలతో సమావేశం నిర్వహించారు. హెచ్‌ఐవీ బాధిత పిల్లల పట్ల వివక్ష చూపే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. చదువుకుంటున్న హెచ్‌ఐవీ పిల్లలకు మిషన్ వాత్సల్య పథకం కింద రూ.4వేలు సహాయం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. డీఎల్‌వో డాక్టర్ చలమయ్య మాట్లాడుతూ బాధిత పిల్లల్లో పౌష్టికాహార లోపాన్ని గుర్తించి వారికి ప్రతినెలా పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే పీవో డాక్టర్ అరుణ, డీఐఈవో పీవీ శివప్రసాద్, డీసీపీవో సీహెచ్ వెంకట్రావు, ఏఆర్‌టీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మీస్రవంతి, సీఎస్‌పీ ప్లస్ ప్రెసిడెంట్ పి.చిట్టితల్లి, ఆర్.వంశీకల్యాణ్, పి.బాలాజీ, ఎ.బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం

తాళ్లరేవు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పటవల గ్రామంలో మండల ప్రజా పరిషత్ నిధులు రూ.8లక్షలతో అభివృద్ధి పనులకు ఎంపీపీ రాయుడు సునీత శంకుస్థాపన చేశారు. డీసీ ఉపాధ్యక్షుడు కొత్తూరి కాశీశ్వరుడు, టీడీపీ నేతలు రాయుడు గంగాధర్, భజన సత్తిబాబు, దంగేటి అప్పన్న, గోవిందు, మేడిశెట్టి గోపాల్, గుండుమేను శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

కరప, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జడ్.బావారంలో పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేసి 8 మందిని అదుపులోకి తీసుకుని రూ.38వేల నగదు, పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్టు కరప ఎస్ఐ తోట సునీత తెలిపారు.

యూటీఎఫ్ ప్రత్తిపాడు మండల కార్యవర్గం ఎన్నిక

ప్రత్తిపాడు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు మండల యూటీఎఫ్ అధ్యక్షుడిగా కోడి శ్రీనివాస్ ఎన్నికయ్యారు. మండల వనరుల కేంద్రంలో శుక్రవారం రాత్రి మండల యూటీఎఫ్ మహాజన సభ నిర్వహించారు. సమావేశంలో మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా జీవీఎస్ ప్రసాద్‌బాబు, ప్రధాన కార్యదర్శిగా ఎంవీ రమణ, జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్‌గా వీవీ రమణ, జిల్లా కుటుంబ సంక్షేమ డైరెక్టర్‌గా రామలింగేశ్వరరావు, జిల్లా సభ్యులుగా చుక్కల గణేష్, శేషుకుమారి, జిల్లా కౌన్సిల్ సభ్యుడిగా దొడ్డిపట్ల రాజబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

సేవలందిస్తుంటే... నిందలా?

● వైద్యాధికారి వర్సెస్ డిప్యూటీ డీఎంఅండ్ హెచ్‌వో


మాట్లాడుతున్న డాక్టర్ మురళీకృష్ణ

ఎటపాక, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఎటపాక మండలం లక్ష్మీపురం పీహెచ్‌సీలో వైద్యాధికారి వర్సెస్ డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో మధ్య డీడీవో బాధ్యతలపై రగడ చోటుచేసుకుంటుంది. ఈక్రమంలో శనివారం పీహెచ్‌సీలో సిబ్బంది నల్లరిబ్బన్లు ధరించి నిరసన వ్యక్తం చేయడంతో పీహెచ్‌సీలో విభేదాలు భగ్గుమన్నాయి. ఈ నేపథ్యంలో పీహెచ్‌సీ డాక్టర్ మురళీకృష్ణ విలేకరులతో మాట్లాడారు. రెండు రోజుల క్రితం డీఎంఅండ్‌హెచ్‌వో తనకు డీడీవో అధికారాలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారని డాక్టర్ మురళీకృష్ణ చెప్పారు. ఇటీవల వరకు డాక్టర్లు సమ్మెలో ఉన్న నేపథ్యంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ పుల్లయ్య ఆ బాధ్యత లను అప్పగించారని, ఆ సమయంలో తాను తన పీహెచ్‌సీతోపాటు డివిజన్‌లోని పీహెచ్‌సీలో విధులు నిర్వర్తించారని తెలిపారు. పీహెచ్‌సీలో కొందరు సిబ్బంది తనను సంప్రదించాకుండా రోగులకు చికిత్స అందిస్తున్నారని, దాంతో ఈవిష యంపై సిబ్బందిని అడగడంతో నాపై వ్యతిరేకతతో వ్యవరిస్తున్నారని పేర్కొన్నారు. ఈనేపథ్యంలో గతంలో హెచ్‌డీఎస్ నిధులు ఖర్చుపెట్టిన తీరుపై ప్రశ్నిస్తున్నందునే సిబ్బందిని తెరపైకి తీసుకువచ్చి రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. పీహెచ్‌సీలో మందుల కొరత, మెటీరియల్ అందు బాటులో లేవని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో దృ ష్టికి తీసుకెళ్లినా ఉన్న వాటితో చికిత్స చేయమంటూ బదులిచ్చారని డాక్టర్ మురళీకృష్ణ తెలిపారు. డీడీవో బాధ్యతలు తనకు తప్పా మరెవరికైనా ఇవ్వాలని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తన జీతం కూడా నిలుపుదల చేశారని ఆరోపించారు. ఈవిష యమై డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ పుల్లయ్యను వివరణ కోరగా పీహెచ్‌సీకి వచ్చే రోగులపట్ల డాక్టర్ మురళీకృష్ణ దురుసుగా ప్రవర్తిస్తున్నారని, దానిపై అనేక ఫిర్యాదులు వచ్చా యని చెప్పారు. తాను డీడీవో బాధ్యతలను అడ్డుకుంటున్నట్టు ఆరోపిస్తున్న వ్యాఖ్యలు అవాస్తమని చెప్పారు.

వైద్యులపై చర్యలు తీసుకోవాలి

● పాడేరు కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు

రంపచోడవరం, నవంబర్ 14(ఆంధ్రజ్యోతి): ఇటీవల రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో తల్లి, బిడ్డ మృతికి కారణమైన వైద్యులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని శుక్రవారం పాడేరుజిల్లా కలెక్టర్ కార్యాలయ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినట్టు ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను తెలిపారు. అధికారులు స్పందించక పోతే న్యాయంకోసం కోర్టును ఆశ్రయించనున్నట్టు తెలిపారు. మాతా, శిశు మరణాల పట్ల అధికారుల నిర్లక్ష్య ధోరణి మారాలన్నారు. ఏజెన్సీలోని ప్రజల ఆరోగ్యం, ప్రాణాలపట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ఆరోపించారు.

యాత్ర ముగిసేలోపే హామీలు నెరవేర్చాలి


ఆదివాసీ సత్యాగ్రహ యాత్రలో మాట్లాడుతున్న జేఏసీ చైర్మన్ రామారావు దొర

చింతూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రంపచోడవరంను ప్రత్యేక జిల్లాగా ప్రకటించి కారం తమన్న జిల్లాగా పేరు పెట్టాలని ఆదివాసీ జేఏసీ జిల్లా చైర్మన్ రామారావు దొర డిమాండ్ చేశారు. వరరామచంద్రపురం మండలంలో మొదలైన ఆదివాసీ సత్యాగ్రహ యాత్ర శుక్రవారం చింతూరులో ముగిసింది. ఈ సందర్భంగా రామారావుదొర మాట్లాడారు. వరరామచంద్రపురంలో మొదలైన తమ సత్యాగ్రహయాత్ర శ్రీకాకుళం జిల్లా సీతంపేట వరకు సాగనుందన్నారు. ఎన్నికల సమయంలో ఆదివాసీల అభ్యున్నతి కోసం సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీలను శ్రీకాకుళం జిల్లా సీతంపేటకు తమ యాత్ర చేరుకొనేలోపే నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రత్యేక డీఎస్సీ నిర్వహించి స్థానిక ఆదివాసీ నిరుద్యోగులతో ఆ పోస్టులను భర్తీ చేయాలన్నారు. జీవో నెం.3ను పునరుద్ధరించా లన్నారు. పోలవరం నిర్వాసితులకు పూర్తిస్థాయిలో పరిహారం, పునరావాసం కల్పించాకనే ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయాలన్నారు. గిరిజనేతర ఉపాధ్యాయులను మైదాన ప్రాంతాలకు బదిలీ చేయాలన్నారు. చింతూరు సెంటరు నుంచి ఐటీడీఏ వద్దకు ర్యాలీగా చేరుకున్న ఆదివాసీలు తమ డిమా ండ్లు నెరవేర్చాలని నినాదాలు చేశారు. ఇన్‌చార్జి పీఓ స్మరణ్‌రాజ్‌కు తమ డిమాండ్లతో కూడిన వినతి ప్రతం అందజేశారు. కార్యక్రమంలో ఆదివాసీ జేఏసీ జాతీయ నాయకుడు మడివి నెహ్రూ, చింతూరు డివిజను చైర్మన్ జల్లి నరేష్, జేఏసీ నాయకులు వేటకాని మల్లయ్య, కారం సాయి. మడివి రాజు. ముర్ల కనకా రెడ్డి తదిరులు పాల్గొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం


హోమన్ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

మోతుగూడెం నవంబరు 14 (ఆంధ్రజ్యోతి):నవంబర్ 14 బాలల దినోత్స వాన్ని పురస్కరించుకొని మోతుగూడెం డీఏవీ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు మల్లెల రఘురాం ఆధ్వర్యంలో ఆర్య సమాజ నియమాలలో భాగమైన హవన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ప్రధానో పాధ్యాయులు విద్యార్థినీ విద్యార్థులను ఉద్దేశించి హవన్ కార్యక్రమం జరపడం వలన ప్రజలకు సిద్ధి, బుద్ధి, ఆయురారోగ్య ఐశ్వర్యాలు పుష్కలంగా లభిస్తాయ ని వివరించారు. అదేవిధంగా బాలల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఆటలు పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ముఖ్యఅతిథులుగా విచ్చేసిన ఎస్ఈ చిన్న కామేశ్వరరావు, డీఈ బాలకృష్ణ బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో భాగంగా జాతీయ స్థాయి కళాభారతి డ్రాయింగ్, చేతిరాత పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు.

అడ్డతీగల(ఆంధ్రజ్యోతి): స్థానిక గాంధీ సెంటర్‌లో రాష్ట్ర ఏపీసీసీ కాంగ్రెస్ కార్యదర్శి దంగేటి సత్తిబాబు ఆధ్వర్యంలో శుక్రవారం జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎం.భాస్కర్, టి.కృష్ణ, రమణ, కె.లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు.

వై.రామవర(ఆంధ్రజ్యోతి): వై.రామవరం శాఖా గ్రంథాలయంలో శుక్రవారం గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభించారు. గ్రంథాలయ అధికారిణి సత్యవతి ఆధ్వర్యంలో నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు భగవాన్ బిర్సాముండా 150వ జయంతి ఉత్సవం

దేవీపట్నం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం భగవాన్ బిర్సాముండా జయంతి ఉత్సవం నిర్వహిస్తున్నట్లు బీజేపీ మండలాధ్యక్షుడు కారం రామన్నదొర తెలిపారు. ప్రజాప్రతినిధులు, సంఘాల నాయకులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఎట్టకేలకు కూనవరంవాసులకు పరిహారం

కూనవరం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కూనవరం పంచాయతీ పోలవరం నిర్వాసితులకు ఎట్టకేలకు పరిహారం తమ బ్యాంకుల్లో జమవుతుంది. చుట్టుపక్కల గ్రామాలైన టేకుబాకా కొండ్రాజుపేటతోపాటు మరికొన్ని గ్రామాలకు పరిహారం జమవుతున్నప్పటికీ మండల కేంద్రమైన కూనవరంనకు ఆలస్యమైంది. శుక్రవారం ఇళ్లకు సంబంధించిన పరిహారం కొంతమంది నిర్వాసితులకు తమ బ్యాంకుల్లో డబ్బులు జమకావడంతో నిర్వాసితులు సంతోషం వ్యక్తం చేశారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

జిల్లాలో 21 'భవిత' కేంద్రాల్లో..ప్రత్యేక బాలలకు విద్య

● భవిత విద్యా కోఆర్డినేటర్ గిరిప్రసాద్

ప్రత్తిపాడు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 21 భవితా కేంద్రాల్లో 1500మంది ప్రత్యేక అవసరాలుగల బాలబాలికలకు విద్యాభివృద్ధికి అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని జిల్లా సమగ్రశిక్ష భవిత విద్య కోఆర్డినేటర్ గిరి ప్రసాద్ తెలిపారు. ప్రత్తిపాడులోని హైస్కూల్ వద్ద నియోజకవర్గ స్థాయి ప్రత్యేక అవసరాల విద్యార్థుల సదరన్ వైద్య శిబిరాన్ని సమన్వయకర్త కోఆర్డినేటర్ గిరిప్రసాద్, టీడీపీ మండల అధ్యక్షుడు అమరాది వెంకట్రావు శుక్రవారం ప్రారంభించారు. కోఆర్డినేటర్ మాట్లాడుతూ భవిత కేంద్రాల బాలలకు వారానికి ఒకరోజు ఫిజియోథెరపీ నిర్వహిస్తున్నామన్నారు. కేంద్రాలకు రాలేని ప్రత్యేక బాలల ఇంటికి ప్రతి శనివారం ట్రైనర్లను పంపి విద్యాభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. భవితా కేంద్రాలకు వచ్చే ఒక్కో విద్యార్థికి ఎస్కార్ట్ అలవెన్స్ రూ.300, రవాణా అలవెన్స్ మరో రూ.300 నెలకు అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రతిఏటా నియోజకవర్గ స్థాయిలో నిర్వహించే సీడబ్ల్యూఎస్ఎస్ ఎసెస్‌మెంట్ క్యాంపుల ద్వారా పిల్లలకు అవసరమైన ఉపకరణాలు అర్హత మేరకు అందజేస్తున్నారని తెలిపారు. శిబిరంలో వైద్యులు నిరూప, మాధురి వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల విద్యా శాఖాధికారులు వి.రాజబాబు, వై.అచ్చిరాజు, హెచ్‌ఎం జాన్‌ప్రసాద్, యాళ్ల విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.


ప్రత్తిపాడులో బాలల సదరం శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

●ప్రత్తిపాడులో బాలలదినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద డీసీసీ ఉపాధ్యక్షుడు ధర్నాల కోట శ్రీను నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మినర్వా,అఖిల్ విద్యాసంస్థల్లో విద్యార్థులు వేషధారణలతో అలరించారు. ఎక్సైజ్ ఎస్‌ఐ వంశీరామ్, ప్రిన్సిపాల్ ఇనకోటి సునీత, కరస్పాండెట్ గంగాధర్ బహుమతులు ప్రదానం చేశారు.

జగ్గంపేట(ఆంధ్రజ్యోతి): భారత తొలి ప్రధాని నెహ్రూ జయంతి, బాలల దినోత్సవం సందర్భంగా జగ్గంపేట శ్రీ ప్రజ్ఞ విద్యాసంస్థల చైర్మన్ బండారు నాగబాబు అధ్యక్షతన వేడుకలు ఘనంగా నిర్వహించారు. జగ్గంపేట టీడీపీ మండల అధ్యక్షుడు జీను మణిబాబు హాజరయ్యారు. రెడ్ కాన్వెంట్‌లో జరిగిన కార్యక్రమంలో లైన్స్ డిస్ట్రిక్ట్ చైర్మన్ కొత్త వెంకటేశ్వరరావు(కొండబాబు) పాల్గొన్నారు.

తొండంగి(ఆంధ్రజ్యోతి): బాలల దినోత్సవాన్ని సందర్భంగా శుక్రవారం అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు బహుమతులు అందించారు. పెరుమాళ్లపురంలో జరిగిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు చాత్రాతి సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు బహుమతులు అందించారు. గడ్డిపేటలో జరిగిన కార్యక్రమంలో ఎంఈవో రెడ్డి పాల్గొన్నారు.

'బాల్యంలోనే భవిష్యత్‌కు బాటలు వేయాలి'

తునిరూరల్(ఆంధ్రజ్యోతి): బాల్యంలోనే భవిష్యత్‌కు బాటలు వేయాలని ప్రభుత్వ విప్, తుని ఎమ్మెల్యే యనమల దివ్య తెలిపారు. తుని మండలం కొలిమేరులో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులనుభావిభారతపౌరులుగా తీర్చిదిద్దే గురుతర బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని తెలిపారు. ఎంఈవో విద్యార్థులతో కలిసి నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి స్వీట్లు పంచారు. టీడీపీ సీనియర్ నాయకుడు యనమల రాజేష్, నాగసోమరాజు, రామునాయుడు, బోడియ్య, నవీన్ ఉన్నారు.

సబ్‌స్టేషన్ నిర్మాణంతో..
విద్యుత్ సమస్యలు తీరినట్టే



గండేపల్లి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగరం పాలెంలో నిర్మించిన సబ్‌స్టేషన్‌తో సింగరం పాలెం, ఎన్‌టీరాజాపురం, రామయమ్మపాలెం గ్రామాలకు విద్యుత్ సమస్యలు తీరనున్నాయి. మండలంలో మారుమూల గ్రామాలకు గండేపల్లి సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా అయ్యేది. పామాయిల్ తోటల్లో నుంచి విద్యుత్ లైన్లతో గాలులు వీచినప్పుడు సరఫరా నిలిచిపోయేది. లోవోల్టేజీతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. నూతన సబ్‌స్టేషన్ నిర్మించాలని ఎన్నోఏళ్ల నుంచి వేడుకున్నా అధికారులు పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం వ చ్చాక ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ చొరవతో రూ.3.29కోట్లతో నూత న సబ్‌స్టేషన్ పనులు ప్రారంభించారు. ఎలక్ట్రికల్ ఈఈ వీరభద్రరావు, డీఈ కె.మల్లాకి, గండేపల్లి ఏఈ కిరణ్‌కిషోర్ సిబ్బందితో కలిసి పనులు శరవేగంగా పూర్తిచేశారు. త్వరలోనే సబ్‌స్టేషన్ ప్రారంభమవుతుందని ఏఈ తెలిపారు. దీని నిర్మాణంతో ఈమూడు గ్రామాలకు విద్యుత్ సమస్యలు తప్పుతాయన్నారు.

బీజేపీ నేతల సంబరాలు

ప్రత్తిపాడు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): బీహార్ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి ఘన విజయం సాధించడంపట్ల బీజేపీ నాయకులు శుక్రవారం సంబరాలు నిర్వహించారు. మార్కెట్ సెంటర్‌లో పార్టీ జిల్లా కిసాన్ మోర్చ అధ్యక్షుడు సింగిలిదేవ్ సత్తిరాజు ఆధ్వర్యంలో కార్యకర్తలకు స్వీట్లు పంచారు. నాయకులు రాజా కింగ్‌బాబు రాజు, మదినే బాబ్జి, మూరా కృపారావు పాల్గొన్నారు.

ఈ స్తంభం కూలితే....ప్రమాదమే


పక్కకు ఒరిగి ప్రమాదంగా ఉన్న విద్యుత్ స్తంభం

రౌతులపూడి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): బలరామపురం గ్రామ శివారు కందా నారాయణ రావు అనే రైతు పొలం వద్ద విద్యు త్ స్తంభం పక్కకు ఒరిగి ప్రమాదంగా మారింది. రౌతులపూడి సబ్‌స్టేషన్ నుంచి చిన్నాయిపాలెం సబ్‌స్టేషన్‌కు 33కేవీ విద్యుత్ సప్లయ్ నిమిత్తం స్తంభాలు వేశారు. ప్రస్తుతం వీటి గుండా 33కేవీ విద్యుత్ సరఫరా అవుతోంది. ఇక్కడ పొలం వద్ద స్తంభం పక్కకు ఒరిగి కూలడానికి సిద్ధంగా ఉంది. ఒరిగిన స్తంభం రహదారి పక్కనే ఉండడం, నిత్యం అనేక వాహనాలు తిరగడంతో అది కూలితే పెనుప్రమాదం తప్పదని, ముందుగానే దాన్ని సరి చేయాలని ప్రయాణికులు, రైతులు కోరుతున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను
రైతులు సద్వినియోగం చేసుకోవాలి

ఏలేశ్వరం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా పంటను విక్రయించుకుని మద్దతు ధరను పొందాలని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి అన్నారు. మండలంలోని సిరిపురంలో వ్యవసాయ అధికారి వెంకట రాజేష్ నేతృత్వంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కొసరాజు, లింగంపర్తి సొసైటీ అధ్యక్షుడు పి.మోహన్, టీడీపీ మండల అధ్యక్షుడు జ్యోతుల పెదబాబు తదితరులు పాల్గొన్నారు.


గ్రామ కార్యదర్శికి వినతిపత్రం అందిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

'అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి'

తొండంగి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ వర్కర్లు గ్రామ సచివాలయాల్లో శుక్రవారం వినతిపత్రాలు అందించారు. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు సీఐటీయూ నేత కామేశ్వరి ఆధ్వర్యంలో కార్యకర్తలు సచివాలయ కార్యదర్శిలకు వినతిపత్రం అందించారు.

ఏపీఎన్జీవో జగ్గంపేట యూనిట్ కార్యవర్గం

జగ్గంపేట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): జగ్గంపేట తాలూకా యూనిట్ ఏపీఎన్జీవో అసోసియేషన్ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. జగ్గంపేటలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో ఎన్నికల అధికారి టీవీ సత్యనారాయణ, వి.క్రాంతికుమార్, సరేలే చంద్రరావు పర్యవేక్షణలో ఎన్నిక జరిగింది. జగ్గంపేట, కిర్లంపూడి, గండేపల్లి మండలాల ఉద్యోగులకు యూనిట్‌లో జగ్గంపేట ఏపీఎన్జీవో అధ్యక్షులుగా సోషల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ డబ్ల్యూహెచ్వో పెట్టా ప్రభాకర్ ఎన్నికయ్యారు. అసోసియేషన్ అధ్యక్షులుగా ఎ.చల్లారావు, ఎల్.నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా సీహెచ్ పారాపాల్ కుమార్, కె.రాజరత్నం, సెక్రటరీగా ఎం.సునీల్ కుమార్, పి.గణేష్‌కుమార్, జాయింట్ సెక్రటరీగా ఎస్.బాబ్జి, ఎన్ఎస్ జి.ప్రసన్న కృష్ణ, మహిళ జాయింట్ సెక్రటరీగా పి.రోజా, కోశాధికారిగా సీహెచ్ వెంకటేశ్వరరావు నియమితులయ్యారు.

ప్రభుత్వ సేవలపై అవగాహన కల్పించండి: డీడీవో

గండేపల్లి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రవేశపెట్టిన మనమిత్ర యాప్, ప్రజల చేతిలో ప్రభుత్వ సేవలు అనే అంశంపై మురారిలో గ్రామస్తులకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. డీడీవో ఎం.శ్యామల మన మిత్ర ద్వారా ప్రభుత్వ సేవలు ఎలా వినియోగించుకోవాలో ప్రజలకు అవగాహన కల్పించారు. సిబ్బందితో సమావేశమై దీనిపై ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎంపీడీవో హరికృష్ణ సత్యరెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో ఐఎస్ శ్రీనివాస్, ఏవో కె.చంద్రరావు, కార్యదర్శి శిరీష ఉన్నారు.

'రైతు శ్రేయస్సే కూటమి ప్రభుత్వ ధ్యేయం'

కోటనందూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): రైతు శ్రేయస్సే కూటమి ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ నేత పెంటకోట భాస్కరసత్యనారాయణ అన్నారు. భీమవరపుకోటలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో తాండవ వైస్‌చైర్మన్ మేరపురెడ్డి జోగిబాబు, సిబ్బంది ఎం.వరహాలబాబు, భవాని, కె.గోపి, మమత, దేవి కిరణ్ పాల్గొన్నారు.

కార్తీకమాస అన్నసమారాధన

జగ్గంపేట,నవంబరు 14(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసాన్ని పురస్కరించుకుని గుర్రంపాలెం రోడ్‌లోని పుష్కర కాలువ గట్టున గణేష్ యూత్ ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు. జగ్గంపేట జనసేన ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్వీఎస్ అప్పలరాజు, ఆలయ కమిటీ సభ్యులు కోనరాజు, కొండ్రోతు శ్రీను పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో మధుమేహ దినోత్సవం

ప్రత్తిపాడు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులోని రెడ్నం రామ్మూర్తి జడ్పీ ఉన్నత పాఠశాలలో మధుమేహ దినోత్సవాన్ని రాచపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారిణి వై.గీతా సుధ మాట్లాడారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ అప్పారావు, ప్రధానోపాధ్యాయుడు జాన్ ప్రసాద్ పాల్గొన్నారు.

రాచపల్లిలో రాజేశ్వరిదేవి హోమం

ప్రత్తిపాడు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): రాచపల్లి అరుణాచలేశ్వర ఆలయంలో కార్తీక బహుళ దశమిని పురస్కరించుకుని రాజరాజేశ్వరిదేవి హోమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు స్వామి రామానంద ఆధ్వర్యంలో పూజలుచేశారు. అపీతకుచాంబ అరుణాచలేశ్వరస్వామికి పంచామృతాభిషేకాలు, పంచహారతులు నివేదించారు.

పార్టీ బలోపేతానికి
సమష్టిగా పనిచేయాలి

యనమల రామకృష్ణుడు

తునిరూరల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సమష్టిగా పని చేయాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు తెలిపారు. తొండంగి మండలం ఎర్రయ్యపేటకు చెందిన పలు వురు వైసీపీ కార్యకర్తలు ఆ పార్టీకి రాజీనామా చేసి టీడీపీలో చేరారు. వీరికి తేటగుంట టీడీపీ క్యాంప్ కార్యాలయంలో యనమల పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు యనమల రాజేష్, సూరాడ రాంబాబు, చొక్కా రాంబాబు, గరికన ఎల్లయ్య, తాడిపర్తి శ్రీధర్, ఎన్.బాబురావు, అనసూరి సూరిబాబు, మన్యం వెంకటరమణ ఉన్నారు.

ప్రజాదర్బార్‌కు వినతుల వెల్లువ

తునిరూరల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): తుని మండలం కొలిమేరులో ఎమ్మెల్యే యనమల దివ్య నిర్వహించిన ప్రజాదర్బార్‌కు ప్రజల నుంచి వినతులు వెల్లువెత్తాయి. వివిధ శాఖలకు సంబంధించి 105 దరఖాస్తులు రాగా వాటిని కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించగా మరికొన్నింటిని అధికారులకు సిఫార్సు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కూటమి పాలన సాగుతున్నదని, ప్రజాదర్బార్‌తో ప్రజా సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సాయి నవీన్, ఎమ్మార్వో ప్రసాద్, రెవెన్యూ, పంచాయతీరాజ్‌శాఖ అధికారులు పాల్గొన్నారు.

'పుస్తక పఠనంతో మరింత విజ్ఞానం'

ఏలేశ్వరం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): పుస్తక పఠనంతో ప్రతి ఒక్కరూ విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని లింగంపర్తి సొసైటీ అధ్యక్షుడు పెంటకోట మోహన్ అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పట్టణ, రూరల్ గ్రామాల్లో గ్రంథాలయ పాలకులు కవికొండ సత్యనారాయణ నేతృత్వంలో నెహ్రూ చిత్రపటానికి శుక్రవారం నివాళులర్పించారు. నగర పంచాయతీ వైస్ చైర్ పర్సన్ శిడగం త్రివేణి, కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపి, మూదీ నారాయణస్వామి, ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ వాగు రాజేష్, రాజు, ఉడతల రమణారావు పాల్గొన్నారు.

గండేపల్లి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ గ్రంథాలయ విభాగం ఆధ్వర్యంలో ఈనెల 14 నుంచి 20 వరకు 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి కె.అశోక్‌కుమార్ తెలిపారు. శుక్రవారం నిర్వహించిన కార్యక్రమానికి యూనివర్సిటీ డిప్యూటీ ప్రోఛాన్సలర్ డాక్టర్ మేడపాటి శ్రీనివాసరెడ్డి హాజరై అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటానికి నివాళులర్పించారు.

ప్రత్తిపాడు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరంలో గ్రంథాలయ వారోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. గ్రంథాలయ అధికారి వి.సన్యాసి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ధ్యాన మండలి అధ్యక్షుడు దొడ్డిపట్ల సోమన్న దొర ప్రారంభించారు. తొలుత నెహ్రూ చిత్రపటానికి సోమన్న దొర, విద్యార్థులు నివాళులర్పించారు.

నిర్వాసితులకు నిధులు మంజూరు

తునిరూరల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): పోలవరం ఎడమ కాలువ నిర్మాణ పనుల్లో భాగంగా తుని వద్ద కాలువ నిర్మాణం కోసం కుమ్మరిలోవ వాసులు ఊరిని ఖాళీ చేశారు. ఆర్‌ఆర్ ప్యాకేజీలో భాగంగా వారికి ప్రభుత్వం తీపికబురు అందించింది. రూ.22.22 కోట్ల నిధులు మంజూరు చేసి పూర్తిస్థాయి మౌలిక వసతుల ఏర్పాటుకు చొరవ తీసుకుంది. ఇప్పటికే అయా కాలనీల్లో పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడంతో ప్రస్తుతం ఇళ్ల నిర్మాణాలు సాగుతున్నాయి. అన్ని మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు రోడ్లు భవనాలశాఖ డీఈ ప్రకాశరావు తెలిపారు. ఈ పనులు నిమిత్తం ప్రస్తుతం టెండర్లు ముగిశాయని, త్వరితగతిన పనులు చేపట్టేందుకు చర్యలు చేపడుతున్నామని ఆయన చెప్పారు.

పరకామణి కేసులో
ఫిర్యాదుదారుడిది హత్యే

జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): టీటీడీ పరకామణి కేసులో ప్రధాన ఫిర్యాదుదారుడు విజిలెన్స్ ఏవీ ఏఎస్‌వో అధికారి సతీష్‌కుమార్‌ను నిందితులైన వైసీపీ వాళ్లు హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని జగ్గంపేట ఎమ్మెల్యే, తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యుడు జ్యోతుల నెహ్రూ ఆరోపించారు. ఈ సందర్భంగా జగ్గంపేటలోని తన క్యాంప్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. వైసీపీ దుండగులు ఆయన్ను రైలు కిందపెట్టి హత్య చేసినట్టుగా తాను నమ్ముతున్నానన్నారు. గతంలో పరిటాల, వివేకానందరెడ్డి హత్య కేసుల్లో సాక్ష్యు లను ఇదేలా హతమార్చారన్నారు. కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, జీను మణిబాబు, కొత్త కొండబాబు, అడపా తాతాజీ, పాండ్రంగి రాంబాబు పాల్గొన్నారు.

నేటి నుంచి రత్నగిరికి పోటెత్తనున్న భక్తజనం

అన్నవరం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ముగియనున్న నేపథ్యంలో సత్యదేవుడి సన్నిధిలో శని, ఆది, సోమవారాలు భక్తులతో పోటెత్తనుంది. భక్తులకు దర్శనాలు, వ్రతాలకోసం ఇబ్బందులు లేకున్నా సత్రం గదుల కేటాయింపు మాత్రం ఒక ప్రహసనంలా మారింది. దేవస్థానంలో 450 గదులు మాత్రమే ఉండగా కార్తీకమాస పర్వదినాల్లో సత్రం గదుల కోసం సిఫార్సు లేఖలు అధికంగా వస్తుండడంతో గదులు కేటాయించలేక సీఆర్వో విభాగ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. మూడురోజులు గడిస్తే కార్తీకమాసంగట్టెక్కినట్లేనని పేర్కొంటున్నారు.

ఘనంగా చండీహోమం

రత్నగిరి క్షేత్రరక్షకిగా పూజలందుకుంటున్న వన దుర్గ ఆలయంలో శుక్రవారం చండీహోమం ఘనంగా జరిగింది. ఉదయం 9గంటలకు పండితులు గణపతిపూజతో కార్యక్రమం ప్రారంభించారు. అమ్మవారికి చండీ, సప్తసతి పారాయణలు, మూలమంత్ర జపాలు పఠించారు. 11గంటలకు పవిత్ర హోమగుండంలో సుగంధ ద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి గావించారు. చతుర్వేద పండితుల వేదాశీర్వచనాలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

'ఆదిత్య' అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు డాక్టరేట్


అసిస్టెంట్ ప్రొఫెసర్ పోతురాజు

గండేపల్లి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ ఈసీఈ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న సీహెచ్ పోతురాజు ఎన్ఐటీ సిల్చార్ అస్సాం నుంచి డాక్టరేట్ సాధించినట్లు ఆదిత్య యూనివర్సిటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ నల్లమిల్లి సతీష్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రొఫెసర్ డాక్టర్ రబుల్ హుస్సేన్ లష్కర్ నేతృత్వంలోని సీహెచ్ పోతురాజు సమర్పించిన థీసిస్ డెవలప్‌మెంట్ ఆఫ్ డీప్ లెర్నింగ్ బేస్డ్ బ్రెయిన్ స్ట్రోక్ అబ్ నార్మాలిటీ సెగ్మెంటేషన్ మెథడ్స్ ఇన్ న్యూరోల్మాజింగ్ మోడలిటీస్ అనే అంశంపై డాక్టరేట్ పొందారన్నారు. ఈ సందర్భంగా పోతురాజును యూనివర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి, డిప్యూటీ ప్రోఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి అభినందించారు.

'ఛలో కలెక్టరేట్ జయప్రదం చేయండి'

గండేపల్లి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఈనెల 20న జరిగే భవన నిర్మాణ కార్మికుల ఛలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయాలని కోరుతూ గండేపల్లిలో శుక్రవారం పోస్టర్ విడుదల చేశారు. ఏపీ బిల్డింగ్ అదర్ కనస్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) జిల్లా కార్యదర్శి రొంగల ఈశ్వరరావు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో భవన నిర్మాణ కార్మికులకు తీరని అన్యాయం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక న్యాయం చేస్తామని చెప్పి ఏడాది గడుస్తున్నా స్పందన లేదన్నారు. 20న తలపెట్టిన కార్యక్రమానికి పెద్దఎత్తున హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో వై.శ్రీనివాస్‌రెడ్డి, ఎస్.మహేష్, వై.శ్రీను, పి.తాతారావు, కె.స్వామి, ఎన్.ధర్మయ్య, డి.అప్పారావు, కె.ప్రసాద్, కె.అప్పలకొండ ఉన్నారు.

'ప్రీ స్కూళ్లను బలోపేతం చేయాలి'

కిర్లంపూడి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రీ స్కూళ్లను పిల్లలతో బలోపేతం చేయాలని కోరుతూ కిర్లంపూడిలో అంగన్‌వాడీ సిబ్బంది మండలంలోని సచివాలయాల్లో శుక్రవారం వినతిపత్రం అందించారు. అంగన్‌వాడీలు సీహెచ్ రత్నం, మంగయమ్మ, హసీనాబేగం, ప్రభావతి పాల్గొన్నారు.

తుని ఏరియా ఆసుపత్రి
సూపరింటెండెంట్ మార్పు

ఇన్‌చార్జ్‌గా డాక్టర్ అన్నపూర్ణ నియామకం

తుని రూరల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): తుని ఏరియా ఆస్పత్రిలో ఇటీవల జరిగిన వరుస సంఘటనల నేపథ్యంలో ఆస్పత్రిలో కీలకమైన పరిపాలన మార్పులు చోటు చేసుకున్నాయి. ప్రస్తుతం ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్‌గా ఉన్న డాక్టర్ స్వప్న స్థానంలో మరో సీనియర్ డాక్టర్ అన్నపూర్ణ ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు వైద్యఆరోగ్యశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా ఆస్పత్రుల సేవల సమన్వయకర్తగా (డీసీహెచ్ఎస్) సీనియర్ వైద్యులు కె.మహేశ్వరరావు నియమితులయ్యారు.